www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

UDYAM - TS-25-0027265

రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..!!

మీకు జర్నలిజంపై ఆసక్తి ఉందా.. అయితే ఆ అవకాశాన్ని మీకు మేం కల్పిస్తాం.
స్థానిక సమస్యలపై అవగాహన ఉంటే చాలు. సమాజహితమే లక్ష్యంగా
వేసే తొలిఅడుగే ఈ తొలిఅడుగు దినపత్రిక ముఖ్య ఉద్దేశం,
ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతు, అవినీతిపై సమర శంఖాన్ని
పూరిస్తున్న తొలిఅడుగు దినపత్రికలో పనిచేయుటకు
ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మెదక్, హైదరబాద్ జిల్లాలు, నియోజకవర్గాలలో
పనిచేయుటకు ఇన్‌చార్జిలు మండల రిపోర్టర్లు కావలెను.
జర్నలిజంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.
సంప్రదించవలసిన నెం.
944 0884 331

హైదరాబాద్, అమరావతి | సంపుటి : 02 | సంచిక : 47 | శనివారం 26 జూలై 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 08 | వెల: 04



## బీసీ సమాజాన్ని రేవంత్ అవమానించారు

- కన్వర్టెడ్ బీసీ అనే కొత్త పదాన్ని రేవంత్‌రెడ్డి తీసుకొచ్చారు
- రాష్ట్ర భాజపా కమిటీలో 20 పోస్టులే ఉన్నాయి
- కాంగ్రెస్ కుటుంబ పార్టీ అయినందున జంబో కమిటీ ఉంటుంది
- భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు


# కాంగ్రెస్‌ది పనికి రాని సర్వే..
# రేవంత్‌వి పిల్లి మొగ్గలు

- 'దేశానికి అత్యధిక కాలం పని చేసిన రెండో ప్రధానిగా నరేంద్ర మోదీ రికార్డు సృష్టించారు
- బీసీలను కాంగ్రెస్ మభ్య పెడుతోంది
- 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం అమలు చేయడంలో ఫెయిల్ అయ్యింది.
- కాంగ్రెస్ ప్రతిపాదించిన 42 శాతం రిజర్వేషన్లలో పది శాతం ముస్లింలకు ఇవ్వడం వల్ల నిజమైన బీసీలకు నష్టం జరుగుతుంది



**ఢిల్లీ**

తెలంగాణలో కాంగ్రెస్ పనికిరాని సర్వే చేసిందని ఆరోపించారు కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి. 75 ఏళ్ల చరిత్రలో కాంగ్రెస్ ఏనాడు బీసీ జనగణన చేయలేదు. బీసీలను కాంగ్రెస్ మభ్యపెడుతోంది అంటూ ఘాటు విమర్శలు చేశారు. బీసీని ప్రధానిని చేసిన ఘటన బీజేపీది అంటూ చెప్పుకొచ్చారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. 'దేశానికి అత్యధిక కాలం పని చేసిన రెండో ప్రధానిగా నరేంద్ర మోదీ రికార్డు సృష్టించారు. బీసీలను కాంగ్రెస్ మభ్య పెడుతోంది. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం అమలు చేయడంలో ఫెయిల్ అయ్యింది. బీసీల్లో ముస్లింలను కలపడం వల్ల బీసీ వర్గాలకి అన్యాయం జరుగుతోంది. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బీసీ సీట్లలో - మిగతా3లో



## ఓబీసీల చరిత్రను ఆర్‌ఎస్‌ఎస్ చెరిపేసింది

- కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ
- ఓబీసీల చరిత్రను ఉద్దేశపూర్వకంగా చెరిపేశారు
- దేశంలో దళితుల చరిత్రను అంబేద్కర్ అర్థం చేసుకున్నారు
- 50 శాతం రిజర్వేషన్ల గోడ బద్దలు కొడతాం

## ఆపరేషన్ సిందూర్ ఆన్‌లోనే ఉంది



- చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్
- యుద్ధ సంసిద్ధత అనేది చాలా హైలెవెల్‌లో ఉండాలి
- యుద్ధ సామర్థ్యాన్ని పెంపుదించుకోవడానికి ప్రతి గడియా, ప్రతి నిమిషం కూడా చాలా అవసరం

## కేబినెట్ భేటీ వాయిదా

- పార్టీలో కీలక చర్చలు, సమావేశాల నిమిత్తం వారు అక్కడే మకాం వేసినట్లు తెలుస్తోంది
- ఈ నెల 28వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది

## రేవంత్ అరాచకాల నుంచి తెలంగాణను రక్షించేది కేసీఆర్ ఒక్కరే


- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఎంతో ముందు చూపుతో అంబేద్కర్ గారు పెట్టిన ఆ ఆర్టికల్ కారణంగానే తెలంగాణ కల సాకారమైంది
- ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో
- తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో అన్ని వర్గాల ప్రజలు దారుణంగా మోసపోయారు



**కామారెడ్డి**

బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ప్రకారమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎంతో ముందు చూపుతో అంబేద్కర్ గారు పెట్టిన ఆ ఆర్టికల్ కారణంగానే తెలంగాణ కల సాకారమైం దని తెలిపారు. బోధించు, సమీకరించు, పోరాడు, అన్న బాబాసాహెబ్ బాటలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కేసీఆర్ ఉద్యమించారని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేటలో నిర్వహించిన ఆత్మగౌరవ గర్జన సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. లక్షలాది మందిని సమీకరించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరాన్ని వాళ్లకు బోధించి, ఎత్తిన జెండా దించకుండా 14 ఏళ్ల పాటు కేసీఆర్ కొట్లాడితే బాబాసాహెబ్ రాసిన రాజ్యాంగం - మిగతా3లో

## ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులు



- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా సీ హరికిరణ్
- కరీంనగర్ ప్రత్యేక అధికారిగా సర్ఫరాజ్ అహ్మద్
- మహబూబ్‌నగర్ ప్రత్యేక అధికారిగా రవి



# నియోజకవర్గాల పునర్విభజన కష్టం

- ఏపీ విభజనచట్టంలో ఏముందో చెప్పిన సుప్రీంకోర్టు
- ఏపీ, తెలంగాణలో డీలిమిటేషన్‌పై దాఖలైన పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు
- 2022లో ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తుది ఉత్తర్వులు
- యూటీలతో పోలిస్తే రాష్ట్రాల్లో డీలిమిటేషన్ నిబంధనలు భిన్నంగా ఉన్నాయన్న సుప్రీం
- 170(3) అధికరణం ప్రకారం ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో సెక్షన్ 26కి పరిమితి ఉంది.

**హైదరాబాద్**

ఏపీ, తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజనపై దాఖలైన పిటిషన్‌ను దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కొట్టివేసింది. 2022లో ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్‌సింగ్‌ల ధర్మాసనం తుది ఉత్తర్వులను జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని తన పిటిషన్‌లో పిటిషనర్ కోరారు. జమ్ముకశ్మీర్‌లో పునర్విభజన చేసే సమయంలో ఆంధ్రప్రదేశ్ విభజన చట్టాన్ని పక్కన పెట్టి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారని అందులో పేర్కొన్నారు. దీనికి సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ 170(3) అధికరణం ప్రకారం ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో సెక్షన్ 26కి పరిమితి ఉందని తెలిపింది. 2026లో మొదటి జన గణన(జనాభా లెక్కలు) అనంతరం మాత్రమే డీలిమిటేషన్ నిర్వహిస్తామని చట్టంలో స్పష్టంగా చెప్పారని పేర్కొంది. ఇలాంటి వ్యాజ్యాన్ని అనుమతించడం వల్ల ఇతర రాష్ట్రాల్లో కూడా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న వ్యాజ్యాలు వరదల్లా వస్తాయని, గేట్లు తెరిచినట్లు అవుతుందని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. కేంద్ర పాలిత ప్రాంతాలతో పోల్చినప్పుడు రాష్ట్రాలలో డీలిమిటేషన్‌కు(నియోజకవర్గాల పునర్విభజన) సంబంధించిన నిబంధనలు - మిగతా3లో

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక
UDYAM - TS-25-0027265

# మూడురెట్లు నింగిలోకి శాటిలైట్లు.. త్వరలో నాసా ఉపగ్రహాన్ని ప్రయోగిస్తాం


స్పేస్‌లో ఉన్న ఉపగ్రహాల సంఖ్యను భారత్ రాబోయే రోజుల్లో మూడురెట్లు పెంచుతుందని ఇస్రో చైర్మన్ వీ నారాయణన్ తెలిపారు. ప్రస్తుతం భారత్‌కు చెందిన శాటిలైట్లు ప్రస్తుతం 55 ఉన్నాయని పేర్కొన్నారు. 'భారత అంతరిక్ష కార్యక్రమం-విజయాలు, సవాళ్లు, భవిష్యత్ దిశ' అనే అంశంపై ఆయన మాట్లాడారు. 2040 నాటికి భారత్ స్పేస్ టెక్నాలజీ, మౌలిక సదుపాయాల పరంగా ప్రపంచంలోని ఇతర దేశాలతో సమానంగా ఉంటుందన్నారు. ఈ ఏడాది ఇస్రో 12 లాంచ్ వెహికిల్ మిషన్లను ప్లాన్ చేస్తోందన్నారు. ఇందులో నాసా-ఇస్రో సింథటిక్ ఎపర్చర్ రాడార్‌ని భారత్ జీఎల్ఎల్వీ-ఎఫ్ 16 జులై 30న ప్రయోగించనున్నట్లు తెలిపారు. ఇస్రో సొంతంగా ఇంటర్నేషనల్ స్పేషన్ సెంటర్‌ను నిర్మిస్తుందని తెలిపారు. తమకు సొంత ల్యాండింగ్ మిషన్ సైతం ఉందన్నారు. ప్రస్తుతం 55 భారత ఉపగ్రహాలు అంతరిక్షం నుంచి ప్రజలకు సేవలందిస్తున్నాయని.. రాబోయే మూడేళ్లలో వాటి సంఖ్య దాదాపు మూడురెట్లు పెరుగుతుందన్నారు. డిమాండ్ ఎక్కువగా ఉందని.. దాంతో కొత్త ఉపగ్రహాలను ప్రయోగించాల్సి ఉందన్నారు. ఇస్రో ఈ దిశగా పని



చేస్తుందన్నారు.

భారత్ 2035 నాటికి పూర్తిస్థాయిలో అంతరిక్ష కేంద్రాన్ని నిర్మిస్తుందన్నారు. మొదటి మాడ్యూల్‌ను 2028లో కక్ష్యలో ఉంచనున్నట్లు తెలిపారు. అంతరిక్ష రంగంలో సంస్కరణలు తీసుకువచ్చే పని జరుగుతుందన్నారు. గతంలో ఇస్రో సర్వీస్ బేస్డ్ మోడల్‌లపై పని చేసిందని.. ఇప్పుడు వాణిజ్య అవకాశాలను వినియోగించుకోవాలనుకుంటుందన్నారు. చంద్రయాన్-3 విజయం తర్వాత భారత్‌తో జపాన్ భాగస్వామ్యం కావాలనే కోరికను వ్యక్తం చేసిందన్నారు. సంయుక్తంగా జాక్సాతో కలిసి చంద్రయాన్-5, లూపెక్స్ మిషన్‌పై కలిసి పని చేయనున్నట్లు తెలిపారు. ఉపగ్రహాన్ని కలిసే తయారు చేస్తున్నామని.. దాన్ని జపాన్ ప్రయోగిస్తుందన్నారు. చంద్రయాన్-3 ల్యాండర్ 1,600 కిలోలు, కొత్త ఈ కొత్త మిషన్ 6,600 కిలోలు బరువు ఉంటుందన్నారు. రాబోయే రెండేళ్లలు పెద్ద వార్తలు వింటారన్నారు. రాబోయే మూడు నెలల్లో ఇస్రో అమెరికా 6,500 కిలోల కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని భారత్ రాకెట్ నింగిలోకి తీసుకెళ్తుందని చెప్పారు. శ్రీహరికోటలో మూడవ లాంచ్‌ప్యాడ్ నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.4వేలకోట్ల కోట్ల బడ్జెట్‌ను ఆమోదించిందని చెప్పారు. గగన్‌యాన్ మిషన్ కింద 2027 తొలి త్రైమాసికంలో భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపాలని భావిస్తున్నది. ఇదిలా ఉండగా.. ఇస్రో ఇప్పటి వరకు 3.4దేశాలకు చెందిన 433 ఉపగ్రహాలను నింగిలోకి పంపింది. ఆయా దేశాలకు సొంతంగా సాంకేతిక లేకపోవడంతో వాటిని ఇస్రో ప్రయోగించింది. గత పదేళ్లలో ఇస్రో మొత్తం 518 ఉపగ్రహాలను ప్రయోగించిందని నారాయణన్ అన్నారు.

## ఓబీసీల చరిత్రను ఆర్ఎస్ఎస్ చెరిపేసింది



**దిల్లీ:** భారత ఉత్పాదక శక్తికి ఓబీసీలు ప్రతీకలని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. అలాంటి వారికి అన్ని రంగాల్లో వివక్ష ఎదురవుతోందని ఆరోపించారు. దిల్లీలో జరిగిన బాగిదారి న్యాయ మహా సమ్మేళనం కార్యక్రమంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాజపా, ఆర్ఎస్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. ఓబీసీల చరిత్రను ఉద్దేశపూర్వకంగా చెరిపేశారని దుయ్యబట్టారు. "2004 నుంచి నేను రాజకీయాల్లో ఉన్నాను. ఈ రెండు దశాబ్దాల కాలం వెనుదిరిగి చూసుకుంటే.. ఓబీసీల ప్రయోజనాలను కాపాడటం కోసం నేను చేయగలిగినంత చేయలేకపోయానని అనిపిస్తోంది. ఆ పొరపాటును ఇప్పుడు సరిదిద్దుకోవాలని అనుకుంటున్నా. సమస్యలు సరిగా అర్థం చేసుకుంటేనే పరిష్కారం సాధించగలం. అందుకోసం చరిత్ర తెలుసుకోవాలి. దేశంలో దళితుల చరిత్రను అంబేడ్కర్ అర్థం చేసుకున్నారు. ఓబీసీల చరిత్ర ఎక్కడుంది. భాజపా ఆర్ఎస్ఎస్ ఉద్దేశపూర్వకంగా ఆ చరిత్రను చెరిపేశాయి" అని రాహుల్ గాంధీ మండిపడ్డారు.

"ఓబీసీలు ఉత్పాదకశక్తికి ప్రతీకలు. కానీ, వారి శ్రమకు తగిన ఫలితాలను అందుకోలేకపోతున్నారు. అన్ని రంగాల్లో వివక్ష ఎదుర్కొంటున్నారు. కార్పొరేట్ ఇండియాలో ఓబీసీలు ఎక్కడున్నారు? మీడియా రంగంలో వారికి స్థానం ఎక్కడుంది? కుల గణన కూడా ఎప్పుడో చేయాల్సింది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మేం తప్పకుండా కులగణన పూర్తిచేస్తాం" అని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు.

**ప్రాంతీయ భాష ముఖ్యమే కానీ..**

ఈ సందర్భంగా భాషా వివాదంపైనా రాహుల్ స్పందించారు. "అభివృద్ధిలో విద్యే ప్రాధాన్యం. ఇంగ్లిష్ నేర్చుకుంటే అవకాశాలు రెట్టింపు అవుతాయి. భాజపా నేతలు మాత్రం ఇంగ్లిష్‌ను వ్యతిరేకిస్తున్నారు. ప్రాంతీయ భాషలూ ముఖ్యమే. దానితో పాటు ఆంగ్ల ప్రాధాన్యాన్నీ అర్థం చేసుకోవాలి" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

# ఆపరేషన్ సిందూర్ ఆన్‌లోనే ఉంది

**న్యూఢిల్లీ:** పహల్గామ్ ఉగ్రదాడిలో తర్వాత పాకిస్తాన్‌లో ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అనేది ఇంకా ఆన్‌లోనే ఉందని సీడీఎస్(చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్) జనరల్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. ఈరోజు(శుక్రవారం జూలై 25) ఢిల్లీలో జరిగిన డిఫెన్స్ సెమినార్‌కు హాజరైన అనిల్ చౌహాన్ మాట్లాడుతూ..ఆపరేషన్ సిందూర్ అనేది అవసరమైన సందర్భంలో మళ్లీ జూలు విదల్చడానికి ఇంకా సిద్ధంగానే ఉందన్నారు.

**అది నిరంతరం నేర్చుకునే ప్రక్రియ**

ఇక భారతదేశ యుద్ధ సామర్థ్యం గురించి ఆయన పలు కీలక విషయాలను చెప్పుకొచ్చారు. యుద్ధ సంసిద్ధత అనేది చాలా హైలెవెల్‌లో ఉండాలన్నారు. యుద్ధ సామర్థ్యాన్ని పెంపుదించుకోవడానికి ప్రతి గడియా, ప్రతి నిమిషం కూడా చాలా అవసరమన్నారు. అటు సస్త్ర(యుద్ధం) ఇటు శాస్త్రం(జ్ఞానం) అనేవి మిలటరీకి 24%ఇ%7, 365 రోజులు చాలా కీలకమన్నారు.

**మూడు స్థాయిల్లో మాస్టర్ కావాలి..**

యుద్ధ రంగంలోకి దిగే సైనికుడు న్రధానంగా మూడు స్థాయిల్లో మాస్టర్ కావాల్సిన అసవరం ఉందన్నారు. అందులో , నిర్ధిషమైన ప్రణాళిక, వ్యూహాత్మకత, కార్యాచరణ, అనేవి యుద్ధ రంగంలో ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. వీటిలో ప్రతీ సైనికులు ఆరితేరి ఉండాలన్నారు. ఇది ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ముందకు సాగడమే తప్ప ఇందులో షార్ట్ కట్స్ అంటూ ఏమీ ఉండవన్నారు. ప్రస్తుత రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానం యొక్క నిరంతర పురోగతి ద్వారా మనం అపూర్వమైన వేగాన్ని చూస్తున్నామని, దాన్ని అందిపుచ్చకుంటూ ముందుకు సాగితేనే యుద్ధంలో పైచేయి సాధిస్తామన్నారు.



కాగా, ఏప్రిల్ 22వ తేదీన పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది అసువులు బాసారు. కశ్మీర్ పర్యాటక ప్రాంతాల్నిచూడటానికి వెళ్లిన పర్యాటకులు ఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలోనేఆపరేషన్ సిందూర్‌ను భారత్ చేపట్టింది. మే 7వ తేదీన భారత్ చేపట్టిన ఈఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్ ఉనికిలో లేకుండా పోయే ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుంది.ఆపరేషన్ సిందూర్ దెబ్బకు పాక్ అతాలకుతలమైంది. భారత్ దాడుల్ని తిప్పి కొట్టలేక ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. ఆపరేషన్ సింధూర్ తర్వాత పాకిస్తాన్ కాస్త దారికొచ్చింది. ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్‌లోకి చొచ్చుకుపోయిని భారత ఆర్మీ బలగాలు అక్కడ కీలక ఉగ్రస్థావరాలను చిన్నాభిన్నం చేశారు. సుమారు వందమందికి పైగా ఉగ్రవాదుల్ని మట్టుబెట్టడం ఒకటైతే, ఉగ్రస్థావరాలు ఉన్న చోటల్లా భారత్ చేసిన దాడులకు పాకిస్తాన్ ఊపిరి తీసుకోలేకపోయింది. అలాగే పాక్ ఆర్మీ క్యాంపుల్ని కూడా భారత్ టార్గెట్ చేసి పైచేయి సాధించింది. భారత్ దాడులకు గుక్క తిప్పులేకపోయిన పాకిస్తాన్.. మే 10వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చింది. పాకిస్తాన్ మిలటరీ ఆపరేషన్ డైరెక్టర్ జనరల్.. భారత్ ఆర్మీకి ఫోన్ చేసి కాల్పుల విరమణ ఒప్పందానికి తమ సంసిద్ధతను వ్యక్తం చేశారు.. అదే సమయంలో పాకిస్తాన్ మళ్లీ ఎటువంటి దుస్సాహసానికి పాల్పడ్డాఆపరేషన్ సిందూర్ ఆన్‌లోనే ఉందని గట్టి హెచ్చరికల నడుమ కాల్పుల విరమణకు అంగీకరించింది భారత్.

## భారత్‌లో తొలి హైడ్రోజన్ కోచ్ పరీక్ష



**విజయవంతం**

దేశంలో మొట్టమొదటి హైడ్రోజన్ కోచ్‌ను విజయవంతంగా పరీక్షించి.. భారతీయ రైల్వే చరిత్ర సృష్టించింది. ఈ వీడియోను కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. హైడ్రోజన్ ఇంధనంతో నడిచే ఈ రైళ్లు.. కాలుష్యాన్ని తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తాయి. పర్యావరణానికి హానికరం కాని, స్వచ్ఛమైన ఇంధన వనరుల వైపు భారత్ అడుగులు వేస్తోంది. ఇది భారతీయ రైల్వేను మరింత టెక్నాలజీ పరంగా అభివృద్ధి చేయడంతో ముందడుగు పడింది. ఈ ప్రాజెక్ట్ విజయవంతం కావడం.. భారత్‌ని హైడ్రోజన్ ఆధారిత రైల్వే సాంకేతికతలో ప్రపంచదేశాల సరసన అగ్రగామిగా నిలబెడుతుందని అశ్విని వైష్ణవ్ ట్వీట్ చేశారు. భారత్ 1,200 %న్గూ% హైడ్రోజన్ రైలును అభివృద్ధి చేసింది. ఇది దేశీయ రవాణా రంగానికి ఒక కీలక మైలురాయి"అని ఆయన పేర్కొన్నారు. మొత్తం హైడ్రోజన్-పవర్డ్ కోచ్ (డ్రైవింగ్ పవర్ కార్) చెన్నైలోని ఐసీఎఫ్ వద్ద విజయవంతంగా పరీక్షించబడిందన్నారు. హైడ్రోజన్ ఫర్ హెరిటేజ్ పథకంలో భాగంగా 35 హైడ్రోజన్ రైళ్లను తయారు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ రైళ్లను దేశ వ్యాప్తంగా హెరిటేజ్, హిల్ స్టేషన్లలో నడపాలని భావిస్తోంది. భారతీయ రైల్వే ఇప్పటికే ఉన్న డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (%ణజువీఖ%)ను హైడ్రోజన్ ఫ్యూయెల్ సెల్‌తో నడిచే విధంగా చేసే పైలట్ ప్రాజెక్ట్‌ను కూడా రైల్వేశాఖ చేపట్టింది.

# లోక్‌సభలో 28న 'ఆపరేషన్ సిందూర్'పై చర్చ.. ప్రధాని మోదీ పాల్గొనే ఛాన్స్!

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడి ఘటనలపై పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చించేందుకు అంగీకరించింది. ఈ రెండు అంశాలపై చర్చించాలంటూ ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. దాంతో సభా కార్యకలాపాలకు అంతరాయం కలుగుతున్నది. వరుసగా పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పడుతూ వచ్చాయి. శుక్రవారం సైతం ప్రతిపక్షాల ఆందోళన నేపథ్యంలో ఉభయ సభలు సోమవారానికి వాయిదాపడ్డాయి. ఆపరేషన్ సిందూర్ అంశంపై సోమవారం (జులై 28ణ) చర్చ జరుగనున్నది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో 'ఆపరేషన్ సిందూర్'పై చర్చను ప్రారంభిస్తారు. ఈ చర్చలో హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జైశంకర్‌తో పాటు బీజేపీ ఎంపీలు అనురాగ్ ఠాకూర్, నిషికాంత్ దూబే పాల్గొంటారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం చర్చలో పాల్గొనే అవకాశం ఉన్నది. జులై 29న రాజ్యసభలో ఈ



అంశంపై చర్చ ప్రారంభం కానున్నది. రాజ్‌నాథ్ సింగ్, జైశంకర్‌తో పాటు ఇతర మంత్రులు పాల్గొంటారు. ఎగువ సభలో జరిగే చర్చలోనూ ప్రధాని మోదీ పాల్గొంటారని భావిస్తున్నారు. అంశంపై ఉభయసభల్లో 16గంటల పాటు చర్చ ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అఖిలపక్ష సమావేశం అనంతరం కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యే ముందుకు కాంగ్రెస్ సహా అనేక ప్రతిపక్ష పార్టీలు ఆపరేషన్ సిందూర్, పహల్గామ్ ఉగ్రదాడిపై పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్ చేశాయన్నారు. దీనిపై చర్చించేందుకు తాము సిద్ధంగానే ఉన్నామన్నారు. ప్రతిపక్షం తొలిరోజు నుంచి పార్లమెంట్‌లో గందరగోళం సృష్టిస్తుందని.. పార్లమెంట్ లోపల, వెలుపల నిరసన తెలుపుతుందని.. సభ పని చేయనివ్వడం లేదని ఆరోపించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలివారంలో తాము ఒకే ఒక బిల్లును ఆమోదించగలిగామని.. పార్లమెంట్ కార్యకలాపాలకు అంతరాయం కలిగించొద్దని ప్రతిపక్ష పార్టీలను కోరుతున్నానన్నారు.

## రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వ పోస్టు స్వీకరించను: సీజేఐ బీఆర్ గవాయ్



**అమరావతి:** పదవీ విరమణ తర్వాత ఎటువంటి పోస్టును స్వీకరించబోను అని సీజేఐ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలోని దారాపూర్ స్వగ్రామంలో ఆయన్ను ఇవాళ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటైర్మెంట్ తర్వాత ఎటువంటి ప్రభుత్వ హోదాను స్వీకరించబోను అని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. రిటైర్మెంట్ తర్వాత తనకు కావాల్సినంత సమయం దొరుకుతుందని, అప్పుడు ఎక్కువ సమయాన్ని దారాపూర్, అమరావతి, నాగపూర్‌లో గడపనున్నట్లు ఆయన తెలిపారు. సీజేఐ గవాయ్ ఈ ఏడాది నవంబర్‌లో రిటైర్ కానున్నారు. స్వగ్రామంకు విచ్చేసిన గవాయ్‌కు భారీ సంఖ్యలో ప్రజలు స్వాగతం పలికారు. కేరళ, బీహార్ మాజీ గవర్నర్, తండ్రి ఆర్ఎస్ గవాయ్ స్మారకం వద్ద నివాళి అర్పించారు. కుటుంబసభ్యులతో కలిసి ఆయన వార్షిక కార్యక్రమంలో పాల్గొన్నారు. దారాపూర్ మార్గంలో నిర్మించనున్న గేట్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఆ గేట్‌కు ఆర్ ఎస్ గవాయ్ పేరు పెట్టనున్నారు.

# ప్రభుత్వ అధికారుల అక్రమాల పుట్టపగులుతోంది.. తవ్వే కొద్దీ డబ్బే డబ్బు

**భువనేశ్వర్:** అవినీతికి పాల్పడుతున్న అటవీశాఖ అధికారుల్ని విజిలెన్స్ అధికారులు ఆట కట్టిస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో ఇద్దరు అటవీ శాఖ అధికారుల ఇళ్లలో విజిలెన్స్ శాఖ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఓ అధికారికి 116 ప్లాట్లు గుర్తించగా.. మరో అధికారి ఇంట్లో తవ్వే కొద్దీ నోట్ల కట్టలు, గోల్డ్ కాయిన్లు, ఇతర బంగారు ఆభరణాలు వెలుగులోకి వచ్చాయి. సదరు అధికారుల ఇళ్లల్లో సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి. అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆరో ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు చేశారు. ఈ సోదాల్లో అటవీశాఖ డిప్యూటీ రేంజర్ రామ చంద్ర నాయక్ నివాసంలో ఆదాయానికి మించిన రూ.1.44 కోట్ల క్యాష్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆయనకు ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ ఆస్మిక తనిఖీలు చేపట్టారు అధికారులు. తనిఖీల్లో జయపూర్‌లోని ఆయన ఫ్లాట్‌లో రహస్య గదిలో దాచిన రూ. 1.44 కోట్ల నగదు, 4 బంగారు బిస్కెట్లు, 16 బంగారు నాణేలు (ప్రతి నాణెం 10 గ్రాములు),6 ప్రాంతాల్లోని జయపూర్, భువనేశ్వర్‌లోని ఆయన నివాసాలు, బంధువుల ఇల్లు, కార్యాలయాల్లో సోదాలు జరుగుతున్నాయి. కాగా, ఈ దాడుల్లో ఆరుగురు డీఎస్పీలు, ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు, తొమ్మిదిమంది ఏఎస్ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. కరెన్సీ కౌంటింగ్ మెషీన్లు ఉపయోగించి నగదు లెక్కింపు కొనసాగుతోంది. ఈ దాడికి ముందు మరో అటవీ శాఖ అధికారి నివాసాల్లో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సదరు అధికారికి 119కి పైగా ప్లాట్లు ఉన్నట్లు తేలింది.





తొలి అడుగు
తెలుగు దిన పత్రిక
UDYAM - TS-25-0027265

# రేవంత్ అరాచకాల నుంచి తెలంగాణను రక్షించేది కేసీఆర్ ఒక్కరే

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణ వచ్చిందని కేటీఆర్ తెలిపారు. ఆ మహనీయున్ని గౌరవించుకోవడానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా 125 అడుగుల విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ప్రతిష్టించుకున్నామని. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సమున్నతంగా గౌరవించుకున్నామని తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరును సెక్రటేరియట్ కు పెట్టిన ఒకే ఒక ముఖ్యమంత్రి భారతదేశంలో కేసీఆర్ ఒక్కరే అని కొనియాడారు. అంబేద్కర్‌ను అంత గొప్పగా గౌరవించుకున్న ముఖ్యమంత్రి దేశంలో ఇంకెవరూ లేరని అన్నారు. దళితుల జీవితాల్లో అద్భుతమైన మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో లక్షలాది దళితులకు మేలు చేయాలన్న సంకల్పంతో దళిత బంధు పథకాన్ని కేసీఆర్ తీసుకొచ్చారని కేటీఆర్ తెలిపారు. దళిత బంధు పేరుమీద కేసీఆర్ రూ.10 లక్షల మాత్రమే ఇస్తున్నారని.. తాము అధికారంలోకి వస్తే రూ.12 లక్షలు ఇస్తామని చేవెళ్లలో ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ను రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కలు ప్రకటించారని గుర్తుచేశారు. అన్ని ప్రభుత్వ పనుల్లో 26% శాతం ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామన్నారని.. దళిత, గిరిజనులు ఇండ్లు నిర్మించుకుంటే ఆరు లక్షలు ఇస్తామని ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ లో చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆరు పైసలు కూడా ఇవ్వని సిగ్గులేని ప్రభుత్వం రేవంత్ రెడ్డిది అని విమర్శించారు.

**ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో**

ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో అని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో అన్ని వర్గాల ప్రజలు దారుణంగా మోసపోయారని అన్నారు. రెండుసార్లు రైతుబంధును ఎగ్గొట్టిన రేవంత్ రెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయన్న కారణంగా మొన్న రైతుబంధు వేశాడని అన్నారు. అరకొరగా రైతుబంధు వేసి సంబరాలు చేసుకోమంటున్న దిక్కుమాలిన ప్రభుత్వం ఇది



అని విమర్శించారు. కేసీఆర్ రైతులకు రూ.10,000 ఇస్తే తాము రూ.15000 ఇస్తామన్నారని.. ముసలి వాళ్లకు ఇస్తున్న 2 వేల పెన్షన్ ను రూ.4000 చేస్తామన్నారని గుర్తుచేశారు. కేసీఆర్ ఇంట్లో ఒకరికి మాత్రమే పెన్షన్ ఇస్తున్నాడు తాము అధికారంలోకి వస్తే ఇద్దరికీ ఇస్తామన్నారన్నారు. అత్తకు 4,000, కోడలు 20,000 ఇస్తామన్నారు. కాని అధికారంలో వచ్చాక ఈ హామీల్లో ఒక్కదాన్ని కూడా అమలుచేయడం లేదని విమర్శించారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు.. 50 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేయాల్సి ఉంటే దాన్ని చివరకు రూ.12 వేల కోట్లకు కుదించి అది కూడా సగమే చేశారని అన్నారు. ఆడబిడ్డలకు తులం బంగారం, నెలకు 2,500 రూపాయలు ఇవ్వడం లేదు. వడ్లకు బోనస్ ఇస్తామని అన్ని బోగస్ మాటలు చెప్పారని మండిపడ్డారు.

**మంది పిల్లలను నా పిల్లలు అని చెప్పుకుంటున్నారు**

రేవంత్ రెడ్డి అపరిచితుడు సినిమాలో రాము, రెమో లాగా ప్రవర్తిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ ప్రభుత్వ అరాచకాలు, దారుణాల నుంచి తెలంగాణ ప్రజలను రక్షించేది ఒక్క కేసీఆర్ నాయకత్వమే అని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్ ఇద్దరి ఉద్యోగాలు ఊడగొడితే మొదటి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. కానీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పూర్తైన నియామకాలకు సిగ్గు లేకుండా ఆఫర్ లెటర్లు ఇస్తూ తామే ఇచ్చామని రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నాడు. మంది పిల్లల్ని నా పిల్లలని చెప్పుకుంటున్నారని మండిపడ్డారు.

**ప్రభుత్వాన్ని నడిపే వారికే.. ఆదాయం తెచ్చే దమ్ము ఉంటుంది**

కేసీఆర్ అప్పులపాలు చేశారని కాంగ్రెస్ వాళ్లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. కరోనా లాంటి కష్టకాలంలో కూడా కేసీఆర్ గారు ఆపకుండా రైతుబంధు, కేసీఆర్ కిట్లు, పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, గురుకులాల్లో సన్న బియ్యం పెట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వాన్ని నడిపే దమ్ము ఉన్నవారికే ఆదాయాన్ని తెచ్చే సత్తా ఉంటుంది. సంపద పెంచి పేదలకు పంచే తెలివి ఉంటుందని అన్నారు. రాహుల్ గాంధీ ఖాతాలో మాత్రమే టకీ టకీమని డబ్బులు పడుతున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఓటే తూటా. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి బీఆర్ఎస్ ను గెలిపించుకుంటేనే అహంకారంతో విర్రవీగుతున్న రేవంత్ రెడ్డి, ఆయన తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారులకు బుద్ధి వస్తుందని అన్నారు.

**తెలంగాణను బాగుచేసుకోవాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవ్వాల్సిందే**

గురుకులాల్లో పిల్లలకు విషం పెడుతున్నారని.. రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇప్పటికే వంద మంది పిల్లలు బలి అయ్యారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. వేములవాడకు వచ్చిన రేవంత్ రెడ్డి తిన్న భోజనం ఖరీదు ఒక ప్లేటుకు లక్ష 35 వేల రూపాయలు. అందాల పోటీల్లో ఒక్క ప్లేట్ భోజనానికి లక్ష రూపాయలు ఖర్చు చేసిన ప్రభుత్వానికి కనీసం వంద రూపాయలతో గురుకులాల పిల్లలకు మంచి భోజనం పెట్టాలన్న సోయి లేదని మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో తెలంగాణ గురుకులాలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అద్భుతంగా పనిచేశాయని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో తెర్లు అయిన తెలంగాణలో మళ్లీ బాగు చేసుకోవాలంటే కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి కావాల్సిందే అని వ్యాఖ్యానించారు.

# ఆశావాహుల్లో నైరాశ్యం!

హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని ఆసక్తి ఉన్నా.. ఇద్దరికంటే ఎక్కువగా పిల్లలు ఉండటంతో నైరాశ్యానికి గురవుతున్నారు. వారికి 1995 లో చేసిన పంచా యతీరాజ్ చట్టం గొడ్డలిపెట్టుగా మారింది. దానిని సవరించాలని గతంలో గత ప్రభుత్వాలకు విజ్ఞప్తులు వచ్చినప్పటికీ చొరవ తీసుకోలేదు. దీంతో పంచాయతీ ఎన్నికలు జరిగినప్పుడల్లా గెలిచినవారిపై ఓడినవారు కోర్టులకు వెళ్లడం పరిపాటిగా మారింది. అయితే ప్రజాప్రభుత్వంపై ఆశావాహులు ఆశలు పెట్టుకున్నారు. మార్పులు చేసి తమకు అవకాశం కల్పిస్తే బాగుంటుందని భావిస్తున్నారు. కోర్టుకు వెళ్తున్న ఘటనలు జనాభా నియంత్రణలో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1995 మే 30న పంచాయతీరాజ్ చట్టంలోని 21వ పేజీలో 3వ అంశంగా చేర్చారు. దీంతో ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలు కలిగినవారికి స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని రద్దు చేశారు. అనర్హులుగా పేర్కొన్నారు. దీంతో చాలా మంది స్థానిక సంస్థల్లో పోటీ చేయాలనే ఆసక్తి ఉన్నప్పటికీ వెనుకంజ వేస్తున్నారు. ఎవరైనా పోటీ చేసి విజేతలుగా నిలిచినా ఓటమిపాలైన వారు కోర్టుకు వెళ్తున్న ఘటనలు ఉన్నాయి. అవికూడా ప్రతిసారి ఎన్నికల సమయంలో నిత్యకృత్యమయ్యాయి. కోర్టులు కొన్ని సార్లు తీర్పును త్వరగా వెలువరిస్తే మళ్లీ వారు పై కోర్టులకు వెళ్తున్న సందర్భాలు ఉన్నాయి. వీటన్నింటికి చెక్ పెట్టాలంటే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్ట సవరణను అసెంబ్లీ సమావేశాల్లో చేయడమేనని పలువురు పేర్కొంటున్నారు. అదే చట్టం చేసి 30 ఏళ్లుగడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు సవరణ చేయలేదు. ప్రత్యేక తెలంగాణరాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ కు 1995 పంచాయతీరాజ్ చట్ట సవరణ చేయాలని విజ్ఞప్తులు వచ్చాయి. ఈ చట్టంతో పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లోనూ ఇద్దరుకంటే ఎక్కువ పిల్లలు ఉంటే అనర్హులు అని పేర్కొన్నారు. అయితే 2019లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీ చట్ట సవరణ చేసి ఇద్దరు పిల్లలు అనే నిబంధనలు సడలించింది. దీంతో పోటీచేసేవారికి ఊరట లభించింది. కానీ గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేవారికి నిబంధనలు సడలించలేదు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు 1995 చట్టం చేసిన చంద్రబాబునాయుడుఏపీలో అధికారంలోకి వచ్చిన తర్వాత సవరణ చేశారు. పోటీచేసేందుకు అవకాశం కల్పించారు. అదే డిమాండ్ తెలంగాణలో ఉన్నప్పటికీ గత ప్రభుత్వం చేయలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి సైతం ఈ అంశాన్ని పలు సందర్భాల్లో తీసుకొచ్చినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సైతం ఇద్దరు పిల్లలకంటే ఎక్కువ ఉన్నా స్థానిక ఎన్నికల్లో అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పలువురు అభిప్రాయపడుతున్నారు. వారికో న్యాయం వీరికో న్యాయమా ఎంపీలు, ఎమ్మెల్సు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసేవారికి, నామినేటెడ్ పోస్టులకు ఎంపిక చేసే నేతలకు 1995చట్టంతో సంబంధం ఉండదు. వారికి ఎంత మంది పిల్లలు ఉన్నా అవకాశం కల్పిస్తారు. చట్టాలు సైతం చేస్తారు. కానీ గ్రామస్థాయిలో పోటీచేసే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలకు అవకాశం కల్పించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. వారికి ఒకన్యాయం, కిందిస్థాయి వారికి మరోన్యాయమా అనేది సర్వత్రా చర్చజరుగుతుంది. ఈ సమావేశంలో 1995 పంచాయతీరాజ్ చట్టంకు సవరణలు చేసేలా నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతు న్నారు. అయితే అంశాన్ని చర్చిస్తారా? లేకుంటే గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాలనే అవలంభిస్తారా? చంద్రబాబు చేసిన 1995 చట్టంనే కొనసాగిస్తారా? అనేది చూడాలి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సవరణ చేస్తే బాగుంటుందని పలువురు విజ్ఞప్తులు చేస్తున్నారు.

# తెల్లవారక ముందే మద్యం అమ్మకాలు

**మహబూబ్ నగర్ :** జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో తెల్లవారక ముందే జోరుగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి కూత వేటు దూరంలో మద్యం అమ్మకాలు సాగిస్తున్న ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించడం లేదు. ఈ ఉదాసీనతకు ఎక్సైజ్ శాఖ అధికారులకు మాముళ్ల అందుతున్నాయనని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బహిరంగానే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు సాగిస్తూ, సమయ వేళలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, మేలచెర్వు చౌరస్తా, జమ్మిచేడు , రాఘవేంద్ర కాలనీలో మొత్తం జిల్లా కేంద్రంలో 8 వైన్ షాపులున్నాయి. నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మద్యం విక్రయాలు చేపట్టాలి. కాని కొత్తబస్టాండ్, ఓల్డ్ వెజిటేబుల్ మార్కెట్, మేలచెర్వు వైన్ షాపుల పక్కన ఉన్న ఫర్మిట్‌రూమ్ ల్లో నిర్వాహకుల కన్ను సన్నల్లో మందుబాబులకు తెల్లవారుజాము నుంచే మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా అన్ని మండల కేంద్రాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలకు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇలా పర్మిట్ రూమ్ ల చాటున నిర్వాహకులు బహిరంగానే మద్యం విక్రయాలు పాల్పడుతున్నా ఎజ్సైజ్ అధికారులు ఎవరూ అటు వైపు తనిఖీలు చేసిన పాపాన పోలేదన్నా విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాలలో సైతం. పచ్చని పల్లెలలో సైతం కొందరు విచ్చలవిడిగా బెల్టు షాపులను నిర్వహిస్తూ యథేచ్ఛగా మద్యం అమ్మకాలను చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 90, క్వార్టర్, హాఫ్,ఫుల్ కు పరిమాణాన్ని బట్టి అదనంగా వసూలు చేస్తూ కొందరు దళారులు సొమ్ము చేసుకుంటున్న ఎక్సైజ్ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి




చూడడం లేదనే ఆరోపణలు ప్రజల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. గ్రామాల ప్రధాన రోడ్ల పక్కనే తాగుతూ ఉండడంతో పొలం పనులకు, ఇతర గ్రామాలకు రాకపోకలు చేసే మహిళలు, మద్యం సేవించని వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మద్యం సేవిస్తున్నారని దీంతో మా కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నం కావడంతో పాటు వారి ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాపుల ముందు అపరిశుభ్రత. జిల్లా కేంద్రంలోని పాత కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మందు బాబుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని సమీపంలోని షాపు ఓనర్లు వాపోతున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా షాపుల ముందు బహిరంగానే మద్యం సేవించడంతో ఖాళీ సీసాలు , గ్లాసులు, కాల్చేసిన సిగరెట్ లు దర్శనమిస్తున్నాయి. షాపుల ముందు మూత్ర విసర్జన చేసి పరిసరాలు దుర్గంధం వెదజల్లేలా చేస్తున్నారని, మద్యం షాపు నిర్వాహకులు మొర పెట్టుకున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. షాపుల ముందు రొచ్చు ఉండటంతో వినియోగదారులు నిత్యావసర సరుకులు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంలేదని, రొచ్చులో వ్యాపారం ఎలా సాగించాలని వ్యాపారులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

## నియోజకవర్గాల పునర్విభజన కష్టం

-మొదటిపేజీ తరువాయి

భిన్నంగా ఉంటాయని ఈ సందర్భంగా సుప్రీం వ్యాఖ్యానించింది.

జమ్మూకశ్మీర్‌పై ప్రత్యేక దృష్టి సారించారన్న పిటిషనర్ వాదనను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. జమ్మూకశ్మీర్ కోసం జారీ చేసిన డీలిమిటేషన్ నోటిఫికేషన్ నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణను మినహాయించడం ఏకపక్షం, వివక్ష కాదని స్పష్టం చెప్తూ పురుషోత్తం రెడ్డి పిటిషన్ ధర్మాసనం కొట్టివేసింది.

**అసలేంటీ డీలిమిటేషన్ ప్రక్రియ**

లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను కొత్త జనసంఖ్యకు అనుగుణంగా అప్‌డేట్ చేస్తారు. 2027లో జనగణన ప్రక్రియ పూర్తయిన అనంతరం ఆ సమాచారం ఆధారంగా లోక్?సభ, అసెంబ్లీ నియోజకవర్గాలను పునర్విభజన చేసే అవకాశం ఉంది. ఈ డీలిమిటేషన్? ప్రక్రియ వల్ల వివిధ రాష్ట్రాల్లోని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యలోనూ మార్పు రానుంది. ప్రతి పార్లమెంట్ సభ్యుడు లేదా ఎమ్మెల్యే దాదాపు ఒకే సంఖ్యలో ప్రజలకు ప్రాతినిథ్యం వహించేలా ఈ మార్పులు జరిగే అవకాశాలున్నాయి. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతీ జనగణన తర్వాత లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. కానీ 1976 నుంచి ఈ తరహా ప్రక్రియను ఆపేశారు. దీనికి కారణం అప్పట్లో ప్రభుత్వం జనాభా నియంత్రణను ప్రోత్సహించాలని భావించడమే. అధిక జనన రేటు కలిగిన రాష్ట్రాలు ఎక్కువగా ఉత్తరాదిలో ఉన్నాయి.

**దక్షిణాది రాష్ట్రాలకు నష్టం!- 26 సీట్లు మైనస్**

ఈసారి నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) తమిళనాడు, కేరళ, ఏపీ, తెలంగాణ లాంటి దక్షిణాది రాష్ట్రాలు 26 లోక్‌సభ సీట్లను కోల్పోతాయనే అంచనాలు వెలువడుతున్నాయి. ఇక ఇదే సమయంలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్, రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో మరో 31 లోక్‌సభ సీట్లు పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. అత్యధిక జనాభా ఉన్నందు వల్ల ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెరుగుతున్నాయి. ఉదాహరణకు తెలంగాణ రాష్ట్రం భారత జనాభాలో 2.8% మాత్రమే ఉన్నప్పటికీ జాతీయ జీడీపీకి 5.2 శాతం అందిస్తోంది. రాష్ట్రాలను కేవలం జనాభా సంఖ్యపరంగా కాకుండా ఆర్థిక సహకారం, అభివృద్ధిపరంగానూ పరిగణించాలని పలు పార్టీలు కోరుతున్నాయి.

## ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులు

తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా సీ హరికిరణ్, కరీంనగర్ ప్రత్యేక అధికారిగా సర్ఫరాజ్ అహ్మద్, నిజామాబాద్ ప్రత్యేక అధికారిగా ఆర్ హన్మంతు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేకాధికారిగా డీ దివ్యను నియమించింది. మహబూబ్‌నగర్ ప్రత్యేక అధికారిగా రవి, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారిగా శశాంక, మెదక్ జిల్లా ప్రత్యేక అధికారిగా ఏ శరత్, ఖమ్మం ప్రత్యేకాధికారిగా కే సురేంద్రన్, హైదరాబాద్ జిల్లా ప్రత్యేక అధికారిగా ఇలంబర్తికి బాధ్యతలు అప్పగించింది.

## బీసీ సమాజాన్ని రేవంత్ అవమానించారు

**హైదరాబాద్:** ప్రధాని మోదీ బీసీ కాదంటూ బీసీ సమాజాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అవమానించారని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు అన్నారు. రాహు ల్‌గాంధీ ఏంటని తాము అడిగితే ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో రామచంద్రరావు చిట్‌చాట్ నిర్వహించారు. కన్వర్టెడ్ బీసీ అనే కొత్త పదాన్ని రేవంత్‌రెడ్డి తీసుకొచ్చారని.. ఆయనకు గోబెల్స్ ప్రైజ్ ఇవ్వాలని వ్యాఖ్యానించారు. రాష్ట్ర భాజపా కమిటీలో 20 పోస్టులే ఉన్నాయని రామచంద్రరావు అన్నారు. 8 ఉపాధ్యక్షులు, 3 ప్రధాన కార్యదర్శులు, 7 కార్యదర్శులు, ఒక కోశాధికారి పోస్టు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ కుటుంబ పార్టీ అయినందున జంబో కమిటీ ఉంటుందన్నారు. గత ఐదేళ్లుగా తనకు పార్టీ పదవి లేదని.. ఇప్పుడు రాష్ట్ర అధ్యక్షుడిని అయ్యానన్నారు. నాయకులు గ్రామాల్లోకి వెళ్లి పనిచేయాలని రామచంద్రరావు సూచించారు.

## కేబినెట్ భేటీ వాయిదా..

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 25వ తేదీన జరగాల్సిన కేబినెట్ భేటీ ఐదుగురు మంత్రులు ఢిల్లీలో ఉండటంతో తాత్కాలికంగా నిలిపివేశారు. తాజా నిర్ణయం ప్రకారం, మంత్రివర్గ సమావేశాన్ని ఈ నెల 28వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ ఐదుగురిలో ముగ్గురు మంత్రులు.. పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి.. ఢిల్లీలో జరుగుతున్న ఏఐసీసీ %ాదీజ% సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లినట్లు సమాచారం. ఈ సమావేశానికి సంబంధించి వారు కాంగ్రెస్ హైకమాండ్ సూచన మేరకు ఢిల్లీకి వెళ్లారు. ఇతర ఇద్దరు కీలక మంత్రులు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నారు. పార్టీలో కీలక చర్చలు, సమావేశాల నిమిత్తం వారు అక్కడే మకాం వేసినట్లు తెలుస్తోంది. కాబట్టి, మంత్రివర్గ సమావేశం పూర్తిస్థాయి హాజరుతో నిర్వహించాలనే ఉద్దేశంతో, సీఎం రేవంత్ రెడ్డి 28వ తేదీకి మళ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశముంది. ముఖ్యంగా రైతుల సమస్యలు, వానాకాలం సాగు, విద్యుత్ సరఫరా, కొత్త పాలసీలు, భూ సర్వేలు, ఋణమాఫీ తదితర అంశాలపై నిర్ణయాలు తీసుకోనున్నారు.

## కాంగ్రెస్‌ది పనికి రాని సర్వే.. రేవంత్‌వి పిల్లి మొగ్గలు

-మొదటిపేజీ తరువాయి

ముస్లింలకు పోటీ చేసే అవకాశం కల్పిస్తున్నారు. కాంగ్రెస్ ప్రతిపాదించిన 42 శాతం రిజర్వేషన్లలో పది శాతం ముస్లింలకు ఇవ్వడం వల్ల నిజమైన బీసీలకు నష్టం జరుగుతుంది. 75 ఏళ్ల చరిత్రలో కాంగ్రెస్ ఏనాడు బీసీ జనగణన చేయలేదు. కాంగ్రెస్ పనికిరాని సర్వే చేసింది. బీసీలలో ముస్లింలను కలిపేలా కేంద్రం కుల గణన ఉండదు. బీసీలకు న్యాయం చేసేలా కుల గణన ఉంటుంది. కాంగ్రెస్ ఏనాడు బీసీ సీఎం, బీసీని ప్రధానిని చేయలేదు. బీసీని ప్రధానిని చేసిన చరిత్ర బీజేపీది. మోదీ కన్వర్టెడ్ బీసీ ఎలా అవుతారు?. కాంగ్రెస్ హయంలోనే మండల కమిషన్ ద్వారా మోదీ కులాన్ని బీసీల్లో చేర్చాలి. బీసీల్లో చేర్చినపుడు కనీసం మోదీ ఎమ్మెల్యే కూడా కాదు. రేవంత్ రెడ్డి మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నాడు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అనేక కులాలు బీసీల్లో కలిశాయి. లంబాడాలను కూడా కన్వర్టెడ్ ఎస్టీ అంటారా?. తెలంగాణలో ఎన్నికలొస్తే కాంగ్రెస్ ఓటమి ఖాయం. కాంగ్రెస్ పాలిత మూడు రాష్ట్రాల లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా వారి ఓటమి ఖాయం. రాహుల్ గాంధీది ఏ సామాజిక వర్గమో చెప్పాలి. ఎన్నికైన ప్రధాని మోదీపై అవాకులూ చెవాకులూ పేలడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నాం. 42శాతం రిజర్వేషన్లు బీసీలకు మాత్రమే ఇవ్వాలి. తొమ్మిదో షెడ్యూల్లో పెట్టేందుకు మాకు అభ్యంతరం లేదు కానీ చట్టానికి లోబడి ఉండాలి. మేము అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పూర్తిగా రద్దు చేస్తాం. మెట్రో విషయంలో రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తాను. ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పిల్లి మొగ్గలు వేస్తున్నారు' అంటూ ఘాటు విమర్శలు చేశారు.

## రేవంత్ క్లియర్ కట్ పిక్చర్...

**హైదరాబాద్ :** మిగతా పార్టీల సంగతి ఎలా ఉన్నా.. కాంగ్రెస్ పార్టీలో పొలిటికల్ ఈక్వేషన్స్ చాలా సులభంగా మారిపోతుంటాయి. అప్పటిదాకా పార్టీ జెండా మోసిన వాళ్లు.. పార్టీ గద్దె కట్టినవాళ్లు.. కేసులు ఎదుర్కొన్న వాళ్ళు పక్కకు వెళ్లి పోతారు. మధ్యలో వచ్చినవాళ్లు.. లాబీయింగ్ చేసినవాళ్లు.. పార్టీ పెద్దల అవసరాలు తీర్చిన వాళు ్ళ ఒక్కసారిగా మందు వరుసలోకి వస్తారు. ఇదేదో మేము చేస్తున్న ఆరోపణ కాదు. ఇటీవల కాలంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని.. ఆ పార్టీలో పని చేస్తున్న సీనియర్ నాయకులు అంటున్న మాట. సరే ఇప్పుడు రాజకీయాలు అనేవి పూర్తిగా డబ్బుమయం అయిపోయాయి. పార్టీ పెద్దల అవసరాలు తీర్చిన వాళ్లకే పీఠాలు దక్కుతున్నాయి. కాంగ్రెస్ మాత్రమే కాదు, అన్ని పార్టీలలో పరిస్థితి దాదాపు ఇలానే ఉంది. ఇక ప్రాంతీయ పార్టీలో అయితే ఆ లెక్కలు వేరే విధంగా ఉంటాయితెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. రేవంత్ ముఖ్యమంత్రి అ కొనసాగుతున్నారు. అధిష్టానం పెట్టిన అనేక శల్య పరీక్షలు దాటుకుని ఆయన ఇక్కడదాకా వచ్చారు. ఇప్పుడిప్పుడే పరిపాలన మీద తన పట్టును

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక
UDYAM - TS-25-0027265

## సంపాదకీయం

# ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వంపై ఊహాగానాలు!?

భారత రాజ్యాంగ వ్యవస్థలో రెండవ అగ్ర పదవి అయిన ఉపరాష్ట్రపతి స్థానం, రాజ్యాంగబద్ధమైన గౌరవం, పార్లమెంటరీ బాధ్యతల సమ్మేళనానికి ప్రతీకగా నిలుస్తుంది. రాజ్యసభ ఛైర్మన్ హోదాలో పార్లమెంటరీ వ్యవస్థను సమర్థంగా నడిపించే బాధ్యత ఈ పదవికి ఉంటుంది. జూలై 21, 2025న జగదీప్ ధన్‌ఖర్ తన పదవికి రాజీనామా చేయడంతో, ఆయన ఉత్తరాధికారిగా ఎవరు బాధ్యత చేపడతారన్న అంశం ఇప్పుడు దేశ రాజధానిలో రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారింది. రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా, బీజేపీ ఈ ఎంపికను వ్యూహాత్మకంగా ఉపయోగించుకునే అవకాశం ఎక్కువ. విపక్షాలైతే దీనిని రాజకీయ నైతికత, సామాజిక సమతుల్యత, ప్రాతినిధ్య విలువలతో కూడిన అంశంగా చూడాలని ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పలు ప్రముఖుల పేర్లు వినిపిస్తూ రాజకీయ చర్చలకు తావిస్తున్నాయి. ఈ జాబితాలో ముందుగా వినిపిస్తున్న పేరు హరివంశ్ నారాయణ్ సింగ్‌ది. బీహార్‌కు చెందిన హరివంశ్ పాత్రికేయ రంగంలో రాణించి, 2014లో జేడీయూ తరఫున రాజ్యసభకు ఎన్నికై, 2018లో డిప్యూటీ ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. ఆయన విధి నిర్వహణలో తటస్థత, నిబద్ధత స్పష్టంగా కనిపించాయి. అధికార పక్షానికి అనుకూలంగానూ, విపక్షాలకు ఆమోదయోగ్యంగానూ ఉండేలా వ్యవహరించిన ఆయనను మళ్ళీ ఎంపిక చేయాలన్న సూచనలు బీజేపీలో ఉన్నట్లు సమాచారం. దీంతో పాటు బీహార్ సీఎం నితీశ్ కుమార్ పేరు కూడా బలంగా వినిపిస్తోంది. ఎన్డీఏ పునఃసంఘటనలో ఆయన పాత్ర కీలకం కావడంతో, ఆయనను ఉపరాష్ట్రపతిగా ప్రతిష్ఠించడం ద్వారా బీజేపీ, బహుళదళ వ్యూహానికి సంకేతాన్ని ఇచ్చే ప్రయత్నం చేయవచ్చునని భావిస్తున్నారు. ఆయన పరిపాలనా అనుభవం, లౌకిక రాజకీయ చాతుర్యం ఈ స్థానానికి అర్హతను ఇచ్చే అంశాలు. జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పేరు కూడా సమీక్షనలో ఉంది. విద్యార్థి ఉద్యమాల నుండి కేంద్ర మంత్రిగా ఎదిగి, ఆర్టికల్ 370 రద్దు తరువాత కాశ్మీర్‌లో పరిపాలనను స్థిరపరిచిన ఆయనకు రాజ్యాంగ నిబద్ధతపై ఉన్న పట్టుదల గుర్తించదగ్గది. ఆయన ఎంపిక అంటే రాజ్యాంగ పునరుద్ధరణ పట్ల కేంద్ర ప్రభుత్వం చూపే స్పష్టతకు సంకేతంగా తీసుకోవచ్చు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేరు కూడా ప్రచారంలోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ బీజేపీ వేదాంతి రాజకీయ నాయకుడు ముఖ్యమంత్రి, కేంద్ర హోంమంత్రి, రక్షణ శాఖ మంత్రి హోదాల్లో అనేక బాధ్యతలు నిర్వహించారు. అయితే ప్రస్తుతం ఆయన దేశ భద్రతకు కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నందున, ఉపరాష్ట్రపతి స్థానానికి వెళ్ళే అవకాశం తక్కువగా ఉందన్న అభిప్రాయాలు ఉన్నాయి. తెలంగాణ నుంచి బీజేపీ సీనియర్ నాయకుడు బండారు దత్తాత్రేయ పేరు కూడా చర్చనీయాంశంగా మారింది. సామాజిక న్యాయం, దక్షిణాది ప్రాతినిధ్యం, బలమైన పార్టీ నిబద్ధతకు ప్రతీకగా ఆయన పేరు నిలుస్తుంది. క్షేత్రస్థాయి కార్యకర్తగా మొదలై కేంద్ర మంత్రిగా ఎదిగిన ఆయన, హర్యానా గవర్నర్‌గా పరిపాలన నిర్వహించిన అనుభవం కలిగిన నాయకుడు. ఆయన ఎంపిక బీజేపీకి దక్షిణాదిలో మరింత స్థిరతను, సామాజిక సంకేతాలను ఇచ్చే అవకాశముంది. ఈ నేపథ్యానికి మరొక విలక్షణతను జోడించే పేరు రాం మాధవ్‌ది. ఆర్ఎస్ఎస్ పూర్వ ప్రచారక్‌గా, బీజేపీలో ముఖ్యమైన వ్యూహకర్తగా, విదేశాంగ, జాతీయ భద్రత రంగాలపై అవగాహన కలిగిన రాజకీయ విశ్లేషకుడిగా రాం మాధవ్ ప్రసిద్ధి. ఆయనలో ఉన్న సిద్ధాంతపరమైన నిబద్ధత, అంతర్జాతీయ అనుభవం, అభ్యుదయ ఆలోచనల కలయిక బీజేపీకి ఒక కొత్త తరహా ఉపరాష్ట్రపతి రూపాన్ని ఇవ్వగలదు. పార్టీలో మేధావి వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలన్న అవసరాన్ని ఈ ఎంపిక తీర్చగలదన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది. ఈ సమీక్షలో ఏ అభ్యర్థిని బీజేపీ ఎంపిక చేస్తుందన్నదే ప్రధాన ప్రశ్న. పార్టీ తన సాంస్కృతిక, రాజకీయ లక్ష్యాలకు అనుగుణంగా ు సామాజిక సమతుల్యత, ప్రాదేశిక సమన్వయం, రాజ్యాంగ నిబద్ధత, పార్టీకి విశ్వసనీయత ు ఈ నాలుగు మూల్యాల మధ్య సమతుల్యాన్ని సాధించే విధంగా నిర్ణయం తీసుకుంటుందా? లేక గుణాత్మక చరిత్రను, ప్రస్తుత రాజకీయ వ్యూహాలను దృష్టిలో ఉంచుకుంటుందా? ఈ ఎన్నికలోనూ రాష్ట్రపతి ఎన్నికల మాదిరిగానే నామినేటెడ్ సభ్యులు మినహాయించి, లోక్‌సభ-రాజ్యసభ ఎంపీలు ఓటు వేస్తారు. ఎన్డీఏకు ఉన్న మెజారిటీ దృష్ట్యా, వారి అభ్యర్థికే విజయం ఖాయమని భావించవచ్చు. గతంలో భైరోసింగ్ శేఖావత్ వంటి వృద్ధ నాయకుడికి గౌరవం తెలిపిన బీజేపీ, హమిద్ అన్సారీ ద్వారా మైనారిటీ ప్రాతినిధ్యాన్ని ప్రోత్సహించిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు హరివంశ్ అయితే తటస్థతకు సంకేతం, నితీశ్ అయితే బహుళదళ మైత్రికి, మనోజ్ సిన్హా అయితే రాజ్యాంగ పునర్నిర్మాణానికి, దత్తాత్రేయ అయితే సామాజిక న్యాయానికి, రాం మాధవ్ అయితే మేధావి రాజకీయ వ్యూహానికి ప్రతీకగా నిలవగలరు. ఈ పదవికి ఎవరైతే వస్తారో, వారు భారత రాజ్యాంగ గౌరవాన్ని, పార్లమెంటరీ వ్యవస్థ విలువలను నిలబెట్టే విధంగా బాధ్యత నిర్వహించాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారు. “ఎవరు ఉపరాష్ట్రపతి?” అన్న ప్రశ్న ఇప్పుడు ఒక రాజ్యాంగ పదవి ఎంపికకు మించిన అర్థాల్ని సంతరించుకుంటోంది. అది దేశ రాజకీయ దిశకు, ప్రాధాన్యాలకు, ప్రాతినిధ్య సంకేతాలకు అద్దం పట్టే ప్రశ్న. సమాధానం కోసం దేశం ఆత్రుతగా ఎదురుచూస్తోంది.

# కార్గిల్ విజయం భారత వీర జవాన్లకు అంకితం



1998లో మన దేశంతో పాటు పాకిస్థాన్ కూడా అణ్వస్త్రాలను ప్రయోగించి తమ సత్తా చాటుకొని అణ్వస్త్ర దేశాల జాబితాలో చోటు దక్కించుకున్నాయి. దేశ సరిహద్దుల్లో శాంతి స్థాపన దిశగా ఉద్రిక్తతలు తగ్గించేందుకు రెండు దేశాలు ఫిబ్రవరి 1999లో లాహెూర్ డిక్లరేషన్‌లో సంతకాలు చేశాయి. ముందు బుద్ధిమంతుల వలె, వెనుక మోసగాళ్ల వలె నడపకున్న చరిత్ర కలిగిన పాకిస్థాన్ తన నీచ బుద్ధిని తరుచుగా చూపిస్తూనే ఉన్నది. ఇలాంటి దుర్బుద్ధి కలిగిన పాపాల పాకిస్థానీ కుట్రల్లో భాగంగా కశ్మీర్‌లో అలజడి సృష్టించడం, సైన్యం చొరబాట్లు జరపడం, ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి భారత్‌లో హింసాత్మక చర్యలను ప్రేరేపించడం, వాస్తవాధీన రేఖను దాటి వ్యూహాత్మక కీలక భారత భూభాగాన్ని ఆక్రమించే ప్రయత్నాలు చేయడం తరుచుగా కొనసాగుతూనే ఉన్నాయి. 1999 అక్టోబర్, మే మాసాల్లో లడక్ ప్రాంత కార్గిల్ జిల్లా సరిహద్దుల్లో పాకిస్థానీ సైనికులు వాస్తవాధీన రేఖను 130 - 200 చ కి మీ మేర దాటి భారత భూభాగంలోకి ప్రవేశించి, పర్వత శిఖరాలను, వ్యూహాత్మక మిలిటరీ స్థావరాలను ఆక్రమించారు. ఈ ఆక్రమణలతో కశ్మీర్, లడక్‌ల మధ్య సంబంధాలను అడ్డుకోవాలనే కుట్రలను పన్నింది పాపాల పాకిస్థాన్. 03 మే 1999 రోజున గొర్ల కాపరుల ద్వారా అసలు పాకిస్థాన్ దురాలోచనలను పసిగట్టిన భారత సైనికులు, పరిస్థితుల తీవ్రతలను గమనించి ఉన్నతాధికారులకు చేరవేయడం జరిగింది. పరిస్థితులను లోతుగా అన్వేషించిన భారత రక్షణ శాఖ, కేంద్ర ప్రభుత్వం “ఆపరేషన్ విజయ్” పేరుతో రెండు లక్షల సైనిక బలగాలతో కార్గిల్ పరిరక్షణ దిశగా యుద్ధం ప్రకటించింది. యుద్ధానికి అనువైన ఎత్తైన భూభాగాలను ఆక్రమించిన పాక్ సైన్యం, చొరబాటుదారులదే పై చేయిగా ప్రారంభంపైన భీకర యుద్ధం రెండు నెలలు, 3 వారాలు, 2 రోజులు కొనసాగింది. ఈ పోరులో పాకిస్థాన్ ఆక్రమించిన భారత భూభాగాలను తిరిగి చేజిక్కించుకొని, 26 జూలై 1999 రోజున భారత్ విజయాన్ని ప్రకటిస్తూ, “టైగర్ హిల్స్”పై జాతీయ పతాకాన్ని ఎగురవేసి అధికారికంగా యుద్ధం ముగిసినట్లు, పాక్ సైన్యం తలవంచి తోక ముడిచినట్లు ప్రకటించింది. కార్గిల్ యుద్ధ విజయంలో భారత ఆర్మీతో పాటు ఇండియన్ ఏయిర్ ఫోర్స్ కూడా చేయి అందించడంతో పాకిస్థాన్ సైన్యం తలవంచక తప్పలేదు. భారత సైన్యం చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం, ప్రాణాలను సహితం లెక్కించక ముందడుగు వేసిన జవాన్ల త్యాగాలను గుర్తు చేసుకుంటూ, అమర జవాన్లకు నివాళులు అర్పిస్తూ ప్రతి ఏట 26 జూలై రోజున దేశ భక్తి ఉప్పొంగే “కార్గిల్ విజయ్ దివస్”ను ప్రతి భారత పౌరుడు అత్యంత అభిమానం, దేశం పట్ల ప్రేమతో ఘనంగా నిర్వహించుకోవడం సర్వసాధారణం అయ్యింది. కార్గిల్ విజయ్ దివస్ రోజున ఢిల్లీలోకి ఇండియా గేట్ వద్ద అమర జవాన్ జ్యోతి వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించడంతో పాటు దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహించడం పరిపాటి అయ్యింది. శ్రీనగర్‌కు 205 కిమీ దూరంలో ఉన్న కార్గిల్‌లో రక్తం గడ్డకట్టకు పోయే అతిశీతల -45 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రతల నడుమ భారత సైన్యం చేసిన యుద్ధం అనన్యసామాన్యం, అనితరసాధ్యం అని చరిత్ర రుజువు చేస్తున్నది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పర్వత శిఖరాల పై భాగాన దొంగచాటుగా చేరిన పాక్ సైనికులతో పర్వతాలు ఎక్కుతూ, పాక్ కాల్పులను తప్పించుకుంటూ, భారత సైన్యం చూపిన యుద్ధ నీతి రేపటి మిలటరీ చరిత్రకు పాఠ్యాంశం అవుతుందనడంలో అతిశయోక్తి లేదు. ఈ యుద్ధంలో రెండు వైపుల సైనికులు ప్రాణాలను కోల్పోవలసి వచ్చింది. “ఆపరేషన్ సఫేద్? సాగర్” పేరుతో ముందుకు సాగిన కార్గిల్ పోరులో భారత పక్షాన 527 మంది ప్రాణత్యాగం చేయడంతో పాటు 1,363 మంది సైనికులు గాయపడ్డారు. పాకిస్థాన్ పక్షాన 1,200 సైనికులు-చొరబాటుదారులు మరణించగా, 1,000కి పైగా గాయపడ్డారు. నిత్యం చొరబాట్లనా ప్రోత్సహించడం, ఉగ్రవాదులకు శిక్షణలు ఇవ్వడంతో పాటు ఆధునిక ఆయుధాలను అందించడం చేస్తున్న పాకిస్థాన్‌కు గతంతోనే 1947, 1965, 1971 ఇండోపాక్ యుద్ధాల్లోను ఓటమి పరాభవాలు చవి చూపింది. కార్గిల్ యుద్ధంలో భారత వీర అమర జవాన్ ‘కెప్టెన్ విక్రమ్ బాత్రా’ను “కార్గిల్ హీరో”గా, హెలికాప్టర్ పైలెట్ ‘ఫ్లైట్ లెఫ్టినెంట్ గుంజన్ సక్సేనా’ను “కార్గిల్ గర్ల్”గా వారి వీరత్వాన్ని ప్రస్తుతిస్తున్నది. కుక్క తోక వంకరే అన్నట్లుగా ఇటీవల 22 ఏప్రిల్ 2025 రోజున పహెల్గామ్ దుర్ఘటనలో పాక్ ఉగ్రవాదులు 26 మంది అమాయక హిందువులను గుర్తించి కాల్చి చంపడంతో కన్నెర్ర చేసిన భారత్ “ఆపరేషన్ సింధూర్” పేరుతో పాక్ ఉగ్ర స్థావరాలను బాంబులతో మట్టుబెట్టడం, పాకిస్థాన్ మిలటరీ స్థావరాలను నేలమట్టం చేయడం, పాకిస్థాన్ ఓటమిని అంగీకరించే స్థితికి తీసుకురావడం కూడా చూసాం. నేడు తాత్కాలిక యుద్ధ విరమణ ఒప్పందం కొనసాగినా ఏ క్షణమైన పాక్ తోక కదిపితే భారత సైన్యం ధీటుగా సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నది. రాబోయే రోజుల్లో పాక్ పిచ్చకపై బ్రహ్మాస్త్రం ప్రయోగించాల్సిందే, బుద్ధిలేని పాకిస్థాన్‌కు తగిన స్థానం చూపాల్సిందే. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు అర్పించిన వీర జవాన్ల కుటుంబాలకు బాసటగా నిలుద్దాం. కార్గిల్ విజయంలో భాగస్వాములైన జవాన్లను హృదయపూర్వకంగా అక్కున చేర్చుకొని సన్మానించుకుందాం. కార్గిల్ యుద్ధ చరిత్రను నేటి యువతకు వివరిస్తూ, వారిలో భారత్ పట్ల ప్రేమను రగిలిద్దాం. జై జవాన్, జై కిసాన్, జై విద్వాన్, జై అనుసంధాన్, భారత్ మాతా కీ జై అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు వినిపిద్దాం.

# కమనీయ చిత్రాల సృష్టికర్త



చిత్రకళా ప్రపంచంలో ఆయన ఓ మహా వృక్షం. చిత్రకళకు ఎనలేని కీర్తిని ఆర్జించిన పెట్టిన అద్భుత కళాకారులు ఆయన. ఆయనే భారతీయ సాంప్రదాయ చిత్ర లేఖనంలో అద్భుతాలు సాధించిన చిత్ర లేఖకులు కొండపల్లి శేషగిరి రావు. తెలుగు చిత్రకళను అంతర్జాతీయ వేదికపై ఆవిష్కరించి, విశ్వ వ్యాపితం చేసిన గొప్ప కళాకారులు శేషగిరిరావు. కొండపల్లి శేషగిరి రావు (జనవరి 22, 1924 - జూలై 26, 2012) తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుప్రసిద్ధ చిత్రకారులైన కొడపల్లి శేషగిరి రావు 1924 జనవరి 22 న వరంగల్ జిల్లా, పెనుగొండ గ్రామంలో ఒక బ్రాహ్మణ భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. వేయి స్తంభాల గుడి, రామప్ప గుడి, పరిసరాల శిల్ప కళా సౌందర్యాన్ని, ఆయా దృశ్యాల నుండి స్ఫూర్తిపొంది తన మనో ఫలకంపై ముద్రించుకుని, సుదీర్ఘ, సునిశిత అధ్యయనంతో కొన్ని వందల చిత్రాలకు ఆయన జీవం పోశారు. చిన్నతనం లోనే ఆయనలోని సృజనాత్మకతను పరిశీలించిన ఆ పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ దీనదయాళ్ ఆనాడే కొండపల్లి గొప్ప కళాకారుడవుతాడని గ్రహించారు. ప్రోత్సహించారు. బెంగాల్, శాంతినికేతన్ లో చిత్రలేఖనం అభ్యసించి, జె ఎన్ టి యు ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపక వృత్తి చేపట్టారు. అయితే ఆయన చిత్రలేఖనా ప్రస్థానం అప్రతి హతంగా సాగింది. భారతీయ ఇతిహాస అంశాలను చిత్రించడంలో శేషగిరిరావు పట్టు సాధించారు. ఆయనది అందె వేసిన చేయిగా మలుచు కున్నారు. అజంతా, ఎల్లోరా గుహాల చిత్రాలను (తిరిగి) గీసిన చిత్రకారుడు జలాలుద్దీన్ ద్వారా కొన్ని మెళకువలు నేర్చుకున్నారు. జైపూర్ లోని బనస్థలి విద్యాపీట్ లో “ఫ్రెస్కో” పెయింటింగ్ పద్ధతిని అభ్యసించారు. ప్రకృతి, చారిత్రక గాథలను.. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలాన్ని ఆయన సజీవ చిత్రాలుగా మలిచారు. ఆయన చిత్రాలలో శకుంతల, దమయంతి, రామాయణం వంటి పురాణాల వివిధ సన్నివేశాలు పలువురి ప్రశంసలు అందు కున్నాయి. లేపాక్షి తదితర చారిత్రక చిత్రకళా కేంద్రాలను దర్శించి, తన భావానుగుణంగా రూపు నిచ్చారు. వరూధినీ- ప్రవరా ఖ్యుడు, రాణి రుద్రమ, గణపతి దేవుడు, శకుంతల చిత్రాలను చిత్రించారు. పోతన భాగవతాన్ని 16 సార్లకు పైగా చదివి, కొండపల్లి అద్భుత సృష్టి చేశారు. చిత్రించారు. అజంతా, ఎల్లోరా, రామప్ప, రాచకొండ దేనినీ ఆయన వదల లేదు. దశాబ్దాల నాటి రంగుల్లో ఆంధ్రపత్రికలో ముఖచిత్రంగా వచ్చిన పోతన చిత్రాన్ని వందలాది తెలుగువారు ఫ్రేములు కట్టించు కున్నారంటే ఆయన ప్రతిభ స్పష్టం అవుతున్నది. ఆక్వా టెక్స్‌చర్ పెయింటింగ్‌లకు ఆయన మార్గదర్శకుడిగా చెబుతారు. ఆయన చిత్రాలను దేశ పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీ , సాలార్ జంగ్ మ్యూజియం లలో ప్రదర్శించారు. కైరో, ఇటలీ, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, కోలాలాంపూర్, లండన్, అమెరికా, మాస్కో తదితర దేశాల్లో జరిగిన ఎగ్జిబిషన్లలో శేషగిరిరావు చిత్రాలు ప్రదర్శిత మయ్యాయి. వాషింగ్టన్ డీసీలోని భారత రాయబార కార్యాలయం, పిట్స్‌బర్గ్ వేంకటేశ్వర స్వామి ఆలయాలకు ఆయన చిత్రాలు మరింత శోభను తీసుకు వచ్చాయి. 1975లో ప్రపంచ తెలుగు మహాసభలకు ఆయన రూపొందించిన తెలుగుతల్లి పెయింటింగ్ ప్రశంసలు పొందింది. తెలుగు మహాసభల సందర్భంగా కొండపల్లి శేషగిరిరావు తెలుగు తల్లిని సాక్షాత్కరింప జేశారు. ఆ చిత్రం ఆధారంగానే తెలుగు తల్లి విగ్రహాలనూ రూపొందించారు. విశ్వామిత్రుడు వంటి ఐతిహాసిక వ్యక్తుల నుంచి, శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్నాటి బ్రహ్మనాయుడు వంటి చారిత్రక వ్యక్తుల నుంచి, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వరకూ తన చిత్రంలో నీరాజనం పలికారు కొండపల్లి. అన్నమయ్య, త్యాగయ్య వంటి వాగ్గేయకారులు, జానపద కళాకారులు ఆయన కళా రూపాల్లో ఒదిగి పోయారు. మహాత్మా.గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలతో పాటు ఎంతో మంది ప్రముఖులు ఆయన చిత్రాలను మెచ్చు కున్నారు. 1994 లో శేషగిరిరావును అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రత్యేకంగా సత్కరించారు. మ్యాక్స్ ముల్లర్ భవన్ డైరెక్టర్ పీటర్ స్విడ్జల అభినందనలు అందుకున్నారు. 1950 నుంచి 90 వరకు ఆయన 37 వ్యాసాలు రాశారు. అవి ‘చిత్ర, శిల్పకళా రామణీయకము’ పేరుతో 2009లో పుస్తకంగా వెలువడ్డాయి. హైదరాబాదు, మైసూరు, మద్రాసు, ఆలిండియా ఆర్ట్ ఎగ్జిబిషన్స్, కోల్‌కతా అకాడమీ ఆఫ్ ఫైనార్ట్, ఏపీ లలిత కళా అకాడమీ అవార్డులను అందుకున్నారు. భారత దేశ స్వాతంత్ర సమరంలో పాల్గొన్న అరవై వసంతాల తరువాత ప్రభుత్వం, జులై 2005 లో శేషగిరి రావును “స్వాతంత్ర సమర యోధుడిగా” గుర్తించి 3,000 రూపాయల వేతనం అందించింది. కేంద్ర మానవ వనరుల శాఖ పక్షాన 1988లో ఎమిరిటస్ ఫెలోషిప్‌ను, తెలుగు యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్‌ను ఆయనకు అందజేశారు. 1993 లో రాజీవ్ రత్న ఎవార్డు పొందేరు. 1996 లో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ఇచ్చి గౌరవించింది. ప్రతిష్ఠాత్మక హంస అవార్డును కూడా ఆయన అందుకున్నారు.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక
UDYAM - TS-25-0027265

# జల సముద్రంగా మణుగూరు

**తొలిఅడుగు స్పెషల్ స్టోరీ:**



మణుగూరు మండలంలో వాన పడితే మణుగూరు ప్రజలంతా అతలాకుతలం అవుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే మణుగూరు వాసులకు కన్నీళ్లు, కష్టాలు, ఆర్థిక నష్టమే మిగులుతుంది. ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి ప్రభుత్వాలు మారిన అధికారులు మారిన సమస్య పరిష్కారం చేయడంలో విఫలం అవుతున్నారు. వరదలు రాగానే రాజకీయ చిన్న నాయకుల దగ్గర నుండి పెద్ద నాయకులు, అన్ని రకాల శాఖలకు సంబందించిన అధికారులు వచ్చి ఫోటోలకు పోజులు ఇచ్చి పేపర్ ప్రకటనలు ఇవ్వడం తప్పితే సమస్యకు శాశ్వత పరిష్కారం చేయడంలో కన్పించడం లేదు.

**నిధులు ఫుల్ అభివృద్ధి నిల్:**
వాగులు పూడిక తీయడానికి సైడ్ డ్రైనేజీ నిర్మాణం చేయడానికి సీసీ రోడ్లు నిర్మాణానికి 2018 సం" నుండి ఈ రోజు వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మణుగూరు మున్సిపాలిటీ ఇచ్చిన నిధులను ఒక్కసారి చూస్తే సిఎస్ఆర్ 2020-21గ్రాంట్ ద్వారా రూ. 4,76,565/-లు మంజూరు చేశారు. పట్టణ ప్రగతి 2022-23 గ్రాంట్ ద్వారా రూ. 4,93,020/-లు ఖర్చు చేయడమైనది. అలాగే సింగరేణి సంస్థ మణుగూరు మున్సిపాలిటీ కి సిఎస్ఆర్ నిధుల ద్వారా రూ. 5లక్షలు కేటాయించడమైనది. ఇరిగేషన్ శాఖ నుంచి 2024 సంవత్సరంలొ 10 లక్షలు కేటాయించారు. 2025 సంవత్సరంలొ కేటాయించడమైనది. ఎస్ ఎఫ్ సి (టి ఎస్ పి) 2019-20 గ్రాంట్ ద్వారా రూ. 7.57 లక్షలు. ఎస్ ఎఫ్ సి (ఎస్ సి ఎస్ పి)2019-20 గ్రాంట్ ద్వారా రూ. 42 లక్షలు. ఎస్ ఎఫ్ సి 2018-19 గ్రాంట్ ద్వారా రూ. 50 లక్షలు. ఎస్ ఎఫ్ సి 2017-18 గ్రాంట్ ద్వారా రూ. 37 లక్షలు. ఎస్ డి ఎఫ్ 2022-23 గ్రాంట్ ద్వారా రూ 40.21లక్షలు మంజూరు చేయడమైనది. ఇన్ని నిధులు వచ్చినా గ్రామాల వరద ముంపు బాధలు తీరడంలేదు.

**ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు:**
వరదలు సంబవించడానికి ప్రధాన కారణం డ్రైనేజీ వ్యవస్థను ప్రభుత్వం స్థలాలను, వాగులను చిన్ని చిన్న కాలువలను సైతం కూడా కొంతమంది బడాబాబులు ఆక్రమించుకొని బహుళ అంతస్తులు నిర్మాణం చేసుకొవడం వలననే వరదలకు కారణం. ఇష్టారీతినా భవన నిర్మాణాలు చేసి ఒక భవనంకు మరో భవనంకు పొంతన లేకుండా నిర్మించి డ్రైనేజీని నిర్వీర్యం చేయడంతో వరద నీరు మొత్తం ఇళ్లలోకి, రోడ్లమీదకి వచ్చిచేరుతుంది.

**మణుగూరు మున్సిపాలిటీ లోపం:**
ఆదాయ వనరులు వచ్చే పనులను తప్ప ప్రజల క్షేమం గురించి పట్టింపు ఉండదు. కార్యాలయం నుంచే నచ్చినట్టు భవనాలు నిర్మించుకోవడానికి పర్మిషన్లు ఇస్తారు. ఇళ్ల నిర్మాణం పూర్తి అవ్వగానే ఇంటిపన్ను ఇస్తారు. పర్యవేక్షణ మాత్రం అధికారులు కానీ మున్సిపాలిటీ కమీషనర్ గాని చెయ్యరు. వరదలు వచ్చినపుడు మాత్రమే అన్ని శాఖల అధికారులు రాజకీయ నాయకులు వీధి వీధికి వచ్చి పరిస్థితి పరిశీలించి ముంపు బాధితులకు అండగా ఉంటాము అని హామీలు ఇచ్చిపోతారు. ప్రజలకు చివరికి ఆ హామీలే మిగిలిపోతాయి ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం మాత్రం అందదు. సహాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి సమయం వృధా కాళ్ళ చెప్పులు అరగడం తప్ప ప్రయోజనం ఉండదు.

**సింగరేణి సంస్థ భూసేకరణ వల్ల:**
మణుగూరులొ అధిక సమస్యలు సింగరేణి సంస్థ వల్లే వస్తున్నాయి. సింగరేణి మనుగడ కొరకు భూసేకరణలు చేసి వాగులను వంకలను దారి మళ్ళించడం గ్రామాలకు గ్రామాలను కాలి చేపించి ప్రకృతి విరుద్ధంగా చేయడంతో అడవుల్లో నుంచి వెళ్లాల్సిన వరదలు ఊర్లమీదకు వస్తున్నాయి. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు సింగరేణి సంస్థ డంప్ యార్డ్ వద్ద అలుగుకట్ట తెగి వరద మొత్తం గాంధీనగర్ నుంచి ప్రవహించింది. సింగరేణి సంస్థ ఒక వైపు బొగ్గు గనులుతొ మరో వైపు మట్టి డంప్ యార్డ్లతో మణుగూరు చుట్టూ సగం భూబాగాని ఆక్రమించి ఉండటంతో వర్షాలకు వరదలు మణుగూరు గ్రామాలను ముంచేతుతున్నాయి.

**నివారణ చర్యలు:**
ప్రతి సంవత్సరం అవ్వే వాగులను పూడికతీతలు పేరుతో మళ్ళీ మళ్ళీ పనులను చేయకుండా మణుగూరులోని అన్ని ఏరియాలో డ్రైనేజీ వ్యవస్థను దిగువ ప్రాంతాలకు వెళ్లేలా ఏర్పాటు చేయాలి. డ్రైనేజీలు లేని గ్రామాల్లో కొత్తగా డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి. పాడైన డ్రైనేజీలను మరమ్మతులు చేయాలి. వర్షాకాలం దగ్గర పడుతున్న సమయంలొ ప్రారంభించి సగం పనులతో వదిలేయకుండా ఆరు నెలల ముందు ప్రారంభించి మొత్తం పూర్తి చేయాలి. జి ఎమ్ కార్యాలయం వైపు నుంచి వచ్చే వరదను, చెరువు ముందు సింగారం, విప్పల సింగారం పొలాల నుంచి వచ్చే వరదను ఇళ్లలోకి రాకుండా వాగులోకి మల్లించాలి. మున్సిపాలిటీ అధికారులు, సింగరేణి అధికారులు చొరవ తీసుకొని మణుగూరు వరదలో మునగకుండా చర్యలు తీసుకొని శాశ్వత పరిష్కారం చూపించి మన మణుగూరుకు కొత్త వైభవం తీసుకురావాలి.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరేయాలి

**కాంగ్రెస్, బి ఆర్ ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి.**
**బీజేపీ స్థానిక ఎన్నికల అభియాన్ జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి శ్రీనివాస్ .**

**ధర్మపురి ప్రతినిధి :- జులై 25 (తొలి అడుగు)వెల్గటూర్:**




వెల్గటూర్ బీజేపీ మండల అధ్యక్షులు గోపతి జనార్ధన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో ప్రతి గ్రామంలో కాషాయ జెండా ఎగురవేసేలా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బీజేపీ స్థానిక సంస్థల జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి శ్రీనివాస్, మ్రరిపెల్లి సత్యమ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన మండల పరిధిలో గల ముఖ్య నాయకులు కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలోనే స్థానిక ఎన్నికల నగారా మోగే అవకాశం ఉన్నందున రిజర్వేషన్ల వారీగా గ్రామ గ్రామాన బిజెపి శ్రేణులు అంతా స్థానిక సమరానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గత ఏడాదిన్నర కాలంగా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు లేనందున ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు.దీనితో పల్లెల్లో పారిశుధ్యం పడకేసిందని అభివృద్ధి మందగించిందని విమర్శించారు. ప్రజల పక్షాన భారతీయ జనతా పార్టీ అండగా ఉంటూ అలుపెరుగని పోరాటం చేస్తుందని దానిలో కేంద్ర ప్రభుత్వ సహకారం మరువలేనిదని అన్నారు. ఇదే స్ఫూర్తితో గడపగడపకు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కేంద్ర ప్రభుత్వ పథకాలను తీసుకువెళ్లి గత పాలనకు ప్రస్తుత పాలనకు తేడాను ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించాలని అన్నారు.రాజ్యాంగానికి తూట్లు పొడిచిన కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని రక్షించాలంటూ అదే రాజ్యాంగాన్ని చేతపట్టుకొని ఊరూరా తిరగడం దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుందని అన్నారు. బీహార్ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరిట బోగస్ ఓట్లు రద్దు చేసి అసలైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించాలని ప్రయత్నం చేస్తే కాంగ్రెస్ పార్టీ అడ్డు పడి ప్రజాస్వామ్య విలువను కాలరాయలని చూస్తోందని ఆరోపించారు. మహిళకు ఉచిత బస్ ప్రయాణంతో ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తుందని మంత్రులు చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తోందని అలాంటప్పుడు పురుషులకు కూడా ఉచిత బస్ ప్రయాణం, రాష్ట్ర ప్రజలందరికీ ఉచిత కరెంట్ ఇస్తే బంగారు తెలంగాణ అయ్యే అవకాశం ఉంటుందని ఎద్దేవా చేశారు.ఈసమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొమ్ము రాంబాబు, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, పోగుల గుండయ్య, పారువెల్లి జీవన్ రావు,దొనకొండ నరేశ్, స్థానిక నాయకులు సంగ వెంకటగిరి,మునిమడుగుల భూమేష్, జక్కుల మహేశ్,బీసవేని హరీశ్, వనపర్తి శంకరయ్య, కునారపు సతీశ్, తిరుపతి,సుమన్,చక్రపాణి,మహేశ్,రాజమౌళి, కిషన్,సతీశ్, తిరుపతి,జితేందర్, రవి, శివన్న, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు..

## గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎలుక కాటు .

**సైదాపూర్ బీసీ గురుకులంలో దారుణం**
**గదిలో చొరబడి నలుగురిని కరిచిన ఎలుక**
**అపరిశుభ్రత వల్లేనని ప్రిన్సిపాల్ వివరణ**

**తొలిఅడుగు ప్రతినిధి జులై 25. హుజురాబాద్ ( అఖిల్ వంశీ )**





ప్రభుత్వం గురుకులాలను అన్ని హంగులతో కార్పొరేట్ స్థాయిలో మార్చామని చెబుతుంటే రాష్ట్రంలో గురుకులాల్లో పరిస్థితి దయనీయంగా తయారైంది. ఓ వైపు ఫుడ్ పాయిజన్ కేసులు మరోవైపు విష పురుగులు కాటు వేస్తుండడం గమనార్హం. తాజాగా ఓ గురుకులంలో విద్యార్థులు ఎలుక కాట్లకు గురికావడం ఆందో ళనకలిగిస్తుంది. ఈ ఘటన హుజురాబాద్ పట్ట ణంలోని (సైదాపూర్) మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో నెలకొంది. ఇవాళ ఉదయం ఓ గదిలో ఎలుక చొరబడి న లుగురు విద్యార్థులను కొరికింది. ఈ విషయం ఉదయం పాఠశాలకు వచ్చిన ప్రిన్సిపాల్కు విద్యార్థులు తెలియజేయడంతో వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. పాఠశాల ఆవ రణలో రైస్ మిల్లు ఉండడం వల్ల అపరిశు భ్ర వాతావరణంతో ఎలుకల తీవ్రత ఎక్కువైంది. ఈ క్రమంలో పాఠశాలలో ఎలుకలు తిరుగుతు న్నట్లు తెలిసింది. ఈ విషయమై ప్రిన్సిపాల్ రాణిని వివరణ కోరగా నలుగురు విద్యార్థులను ఎలుక కొరికిందని, వారికి చికిత్స చేయడంతో పాటు ఆ గదిలో ఉన్న అందరి విద్యార్థులకు చికిత్సలు చేయించామని తెలిపారు. ఎలుకల నివారణ కోసం బోన్లను, వలలను ఏర్పాటు చేశామని చుట్టుపక్కల చెత్తాచెదారం నిండి రైస్ మిల్లు ఉండటంతో ఎలుకలు వస్తున్నాయని ఆమె తెలిపారు.

## గానుగుపహాడ్ చిటకోడూరు వంతెనలు నిర్మించాలి

**వాల్ పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎంపీపీ మేకల కలింగరాజు.**



**జనగామ,జులై 25 తొలిఅడుగు న్యూస్ దిన పత్రిక**

ఈరోజు జనగామ జిల్లా కేంద్రంలో మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు గానుగుపహాడ్ చీటాకోడూర్ వంతెన నిర్మాణ వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగినది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 వ తారీఖు జనగామ కలెక్టర్ కార్యాలయం వద్ద గానుగుపహాడ్ చీటాకోడూర్ బ్రిడ్జి సాధన సమితి ఆధ్వర్యంలో చేసే రిలే నిరాహారదీక్షల ను విజయవంతం చేయాలి అని అన్నారు.గతం లో కురిసిన భారీ వర్షాలకు కూలిపోయిన గానుగుపహాడ్ వంతెన పనులు సగం లో ఆగిపోయినాయి అని చిటకోడూరు వంతెన పనులు ప్రారంభం చేయాలి అని అన్నారు.ఈ కార్యక్రమం లో బ్రిడ్జి నిర్మాణ సాధన సమితి అధ్యక్షులు యాసారపు కరుణాకర్,తొట్టె కృష్ణ,గొంగళ్ళ కుమార్,సతీష్,పులి పవన్ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతగా పనిచేసిన ఫీల్డ్ ఆఫీసర్ రాజుకి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు



**జనగామ,జులై 25 తొలిఅడుగు న్యూస్ దిన పత్రిక**

ఈరోజు మానసిక స్థితి సరిగా లేక చౌడారం హాస్టల్ వద్ద గత మూడు రోజులుగా అక్కడ తిరుగుతూ స్కూల్ కు వెళ్లే పిల్లలు మహిళలు భయపడుతున్నారని మానసిక స్థితి సరిగా లేక దాదాపు 50 సంవత్సరాల వ్యక్తి సంచరిస్తున్నారని తనకు తినడానికి తిండి కూడా లేదని చెట్లల్లో తిరుగుతున్నాడని జనగామ అమ్మ ఫౌండేషన్కు తెలియజేసిన ముక్క విష్ణు ఈ విషయంపై జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ జనగామ జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ రాజు కి తెలియజేయడంతో తాను వెంటనే తన బృందంతో చౌడారం గ్రామానికి చేరుకొని తనను తీసుకుని విచారణ చేసి ప్రభుత్వ అధికారుల సహకారంతో మానసిక పరిస్థితి మరియు పోలీస్ అధికారుల యొక్క సలహాలు సూచనలతో హాస్పిటల్కు లేదా అనాధ ఆశ్రమం కు తీర్చేలా చర్యలు తీసుకున్నందుకు ప్రత్యేకంగా వర్షంలో వచ్చి కూడా బాధ్యతగా పనిచేసిన ఫీల్డ్ ఆఫీసర్ రాజు కి వారి యొక్క బృందానికి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిన జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మంతెన మణికుమార్ ముఖ్య సలహాదారులు వంగ భీమ్ రాజ్ మరియు టీం తరపున ధన్యవాదాలు తెలియజేశారు

## గోదావరి, కృష్ణ జలాలను ఆంధ్ర ప్రాంతానికి తరలించే కుట్ర చేసిందే కేటీఆర్ తండ్రి కేసీఆర్

**తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు బిపెరుమండ్ల రమేష్**

**తలకొండపల్లి మండల ప్రతినిధి జూలై 25 తొలి అడుగు దిన పత్రిక**



బికేటీఆర్ కు నీళ్ల గురించి తెలియదు, ప్రాజెక్టుల గురించి తెలియదు,నీళ్ళు, ప్రాజెక్టు గురించి వాటి అభివృద్ధి గురించి కెటిఆర్ కు ఏమీ తెలియదు,బనకచర్ల విషయంలో కేటీఆర్ చేస్తున్నవి పిచ్చికూతలు,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిపై బురద జల్లేందుకే కేటీఆర్ తెలిసి తెలియని మాటలు మాట్లాడుతున్నాడు.రేవంత్ రెడ్డి గారి మీద అసత్య ప్రకటనలు చేయడానికి కేటీఆర్ ను కేసీఆర్ వాడుకుంటుండు.తెలంగాణ వాటాలను తీసుకురావడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ తగ్గేది లేదు.తెలంగాణ హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు.సమగ్రమైన నీటి ప్రణాళికల కోసం రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం తో కలిసి నిర్ణయాలు తీసుకుంటాయి.కాంగ్రెస్ ప్రభుత్వం పై అసత్యాలు ప్రచారాలు చేస్తూ, పిచ్చికూతలు కూయడం అలవాటుగా మారింది దానిని మానుకోవాలని హితవు.

## 27న జరిగే 'జ్ఞాపకాల ఊరేగింపు' పుస్తకావిష్కరణ సభను విజయవంతం చేయండి

**తొలిఅడుగు ప్రతినిధి : హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ :**

రచయిత, జర్నలిస్ట్ ఆవునూరి సమ్మయ్య రాసిన"జ్ఞాపకాల ఊరేగింపు" పుస్తకావిష్కరణ సభని విజయవంతం చేయాలని జన సాహితి, హుజురాబాద్ సభ్యులు ఒక ప్రకటన లో కోరారు. ఈ నెల 27 ఆదివారం రోజున హుజూరాబాద్ క్లబ్ ఆవరణలోని వి.ఎల్.ఆర్.కన్వెన్షన్ లో ఉదయం 11 గంటలకు ప్రముఖ రచయిత, వీక్షణం పత్రిక సంపాదకులు ఎన్.వేణుగోపాల్ ఈ వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తారని న్యాయవాది, కవి, జర్నలిస్ట్ ముక్కెర రాజు అధ్యక్షతన జరిగే ఈ ఆవిష్కరణ సభలో సాహితివేత్తలు డా.ఎస్.తిరుపతయ్య, పుప్పాల శ్రీరాం, విప్లవ్ దత్ శుక్లా, హుస్సేన్, కందుకూరి అంజయ్య లు ప్రసంగిస్తారని వారు పేర్కొన్నారు. పుస్తకావిష్కరణ సభలో సాహిత్య సృజనకారులు, కళాకారులు, సాహిత్యాభిమానులు, సామాజిక ఉద్యమ కారులు, ప్రజాసంఘాల బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పల్కల ఈశ్వర్ రెడ్డి, రవిశంకర్ శుక్లా వేల్పుల రత్నం, భీమోజు సదానందం, పొడిశెట్టి వెంకటారాజం, వేల్పుల ప్రభాకర్, మార్త రవీందర్, టి.ఎస్.సింగ్, పూలు జగన్నాధం, బండి రమేష్, కొత్తూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక
UDYAM - TS-25-0027265

## హుజురాబాద్ పట్టణంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం





హుజురాబాద్ నియోజకవర్గం తొలిఅడుగు ప్రతినిధి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా హుజురాబాద్ పట్టణంలో శుక్రవారం ఆయన దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులపై హైదరాబాదులోని తెలంగాణ భవన్ లో కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి, మంత్రులపై తప్పుడు ఆరోపణలు చేశారని వారు ఆరోపించారు. ఓటు వేయకపోతే ఆత్మహత్య చేసుకుంటా అంటూ ప్రజలను మభ్యపెట్టి గెలిచిన కౌశిక్ రెడ్డి ఇప్పుడు పేదల సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ నేపథ్యంలో అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన నిరసన కార్యక్రమంలో కౌశిక్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు . చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పార్టీ నిర్మాణంపై పవన్ దృష్టి

విజయవాడ

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వచ్చే నెల నుంచి పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టనున్నారు. పదవులపైన కూడా క్లారిటీ ఇచ్చే అవకాశముంది. పార్టీ పదవులతో పాటు నామినేటెడ్ పదవుల విషయంలోనూ జనసేనాని కొంత కసరత్తులు చేస్తున్నట్లు సమాచారం. ఇన్నాళ్లూ సినిమా షూటింగ్ లలో బిజీగా ఉన్న పవన్ కల్యాణ్ ఇక పార్టీకి 2014 నాటి హైప్ తెచ్చే ప్రయత్నంలో ఉన్నారట. ఇందుకోసం అనేక నియోజకవర్గాలలో సర్వేలు కూడా చేయిస్తున్నారు. తమకు పట్టున్న జిల్లాల్లో కొంత పార్టీని మరింత బలోపేతం చేసిన తర్వాత మిగిలిన నియోజకవర్గాలకు పార్టీని విస్తరించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. పవన్ కల్యాణ్ తన ఇమేజ్ ఏ మాత్రం తగ్గకుండా చేస్తున్న ప్రయత్నాలు క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలన్న ప్రయత్నంలో ఉన్నారు. అవసరమైతే ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించడానికి కూడా సిద్ధమయినట్లు కనిపిస్తుంది. ఇటీవల మీడియాలకు ఇంటర్వ్యూలు ఇస్తూ కూటమిలో అన్ని పార్టీలు సమన్వయంతో కలసి పనిచేస్తున్నాయని చెప్పిన పవన్ కల్యాణ్ రాజధాని అమరావతి భూములు అదనంగా సేకరించే విషయంలో మాత్రం తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టేశారు. రాజధానికి అదనపు భూమిని ఇవ్వడంలో బలవంతం ఏమీ లేదని, ఇష్టపూర్వకంగా ఇస్తేనే ప్రభుత్వం తీసుకుంటుందని, బలవంతంగా మాత్రం తీసుకోదని ప్రభుత్వం తరుపున చెప్పారంటే ఆయన అదనపు భూ సేకరణను వ్యతిరేకించినట్లే కనపడుతుంది. రాజధాని రైతుల్లో నెలకొన్న అసంతృప్తిని ఆయన గమనించి ఈ వ్యాఖ్యలు చేసినట్లు కనిపిస్తుంది. జనసేన ఎమ్మెల్యేలతో పాటు కూటమి పార్టీల్లోని ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతను కూడా ఆయన పసిగట్టినట్లు సమాచారం. స్థానికంగా సమస్యలను పరిష్కరించలేకపోతుండటంతో నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేల పనితీరు పట్ల అసంతృప్తిగా ఉన్నారని తెలిసింది. జనసేనకు చెందిన ఇరవై మంది ఎమ్మెల్యేల్లో దాదాపు పదిహేను మంది ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఉన్నట్లు సర్వే ద్వారా తేలడంతో వారిని పిలిచి క్లాస్ పీకేందుకు సిద్ధమయ్యారని చెబుతున్నారు. త్వరలోనే ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి రానున్న నాలుగేళ్ల పాటు కష్టపడి పనిచేసి మంచి మార్కులు తెచ్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు దక్కవన్న హెచ్చరికలు కూడా పవన్ జారీ చేసే అవకాశముందని తెలిసింది. మొత్తం మీద ఆగస్టు నెలలో ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ సీరియస్ గానే వార్నింగ్ ఇచ్చే అవకాశముంది.

## రోజా నోరు తెస్తున్న తంటా

తిరుపతి

వైసీపీకి మాజీ మంత్రి రోజా లాంటి వారు అస్సెట్ అవుతారనుకుంటే భారంగా మారుతున్నారు. బరువుగా పార్టీకి తయారవుతున్నారు. అరెస్ట్ లతో కాస్తో కూస్తో వైసీపీకి సానుభూతి లభిస్తుందని భావిస్తే, రోజా లాంటి వారితో ఉన్నదంతా తుడిచిపెట్టుకుపోతుంది. రోజా చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగానే కాదు.. సాధారణ జనానికి కూడా మంట తెప్పిస్తున్నాయి. రోజా లాంటి నేతల నోళ్లను కొన్నాళ్లపాటు అదుపులో పెట్టకపోతే జగన్ కు వచ్చే ఎన్నికల్లోనూ తీరని నష్టం జరుగుతుందన్న విశ్లేషణల్లో వాస్తవముంది. రోజా నోటికి ప్లాస్టర్ వేయాలని సొంత పార్టీ నేతలే కోరుతున్నారంటే ఆమె ఏ రేంజ్ లో మాట్లాడిందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా జగన్ ఇటువంటి నేతల విషయంలో సీరియస్ డెసిషన్ తీసుకోవాలంటున్నారు ఆర్కే రోజాపై నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టాల్సిందే. అయితే ఆ వ్యాఖ్యలతో వచ్చిన సానుభూతిని రోజా తన వ్యాఖ్యలతో తనకు తానే చెరిపేసుకున్నారు. పార్టీని కూడా డ్యామేజ్ చేశారు. నగరిలో నిర్వహించిన రీకాలింగ్ చంద్రబాబు కార్యక్రమంలో పాల్గొన్న రోజా రాష్ట్రంలో ఎమ్మెల్యేలుగా గాలిలో గెలిచిన గాలిగాళ్లే ఎక్కువైపోయారంటూ విమర్శలు చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ వీకెండ్ నాయకులు అని ఫైర్ అయ్యారు. ఒక్కరు కూడా ప్రజల దగ్గరికి వెళ్లి వాళ్ల కష్టం ఏంటో అడగరని రోజా అన్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే టీడీపీ, జనసేన నేతలు అమెరికా పారిపోవాలని చెప్పారు. చంద్రబాబు డబ్బులు ఎక్కువగా ఇస్తున్నారని అందుకే పవన్ కళ్యాణ్‌కు పిచ్చి బాగా ముదిరిపోయిందంటూ ఆరోపించారు... రాష్ట్రంలో గాలిలో గెలిచిన గాలిగాళ్లు ఎక్కువైపోయ్యారు. ఇప్పుడే హైదరాబాద్‌కు పారిపోయే వాళ్లు.. రేపు జగనన్న ప్రభుత్వం వస్తే వీళ్లు హైదరాబాద్ కాదు.. అమెరికాకు పారిపోతారంటూ రోజా చేసిన వ్యాఖ్యలు పార్టీని ఖచ్చితంగా ఇబ్బది పెట్టేవే. ఆ రోజు మిమ్మల్ని కాపాడటానికి ఎవ్వరు ఉండరని, వీళ్లని నమ్మితే ఈరోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాళ్లని మీరు టార్చర్ పెట్టినా.. కేసులు పెట్టించినా.. కొట్టినా.. దానికి 100 రెట్లు మీకు వడ్డీతో కూడా తిరిగి

# పదవ తరగతి విద్యార్థులకు బండి సంజయ్ కానుకగా సైకిల్స్ పంపిణీ





**జమ్మికుంట పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు మాజీ మునిసిపల్ చెర్మన్ శీలం శ్రీనివాస్**

తొలిఅడుగు ప్రతినిధి హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ : ( అఖిల్ వంశీ )

కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు, కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తన పుట్టినరోజు సందర్భంగా కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మోడీ గిఫ్ట్ గా 20 వేల సైకిల్స్ పంపిణీ కార్యక్రమం చేస్తున్నారని, ఈరోజు జమ్మికుంట పట్టణంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న 13 మంది విద్యార్థిని విద్యార్థులకు సైకిల్ పంపిణీ చేశారు, ఈసందర్భంగా పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు మాట్లాడుతూ ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు నిరుపేద కుటుంబానికి చెందిన వారే అని, వారి తల్లిదండ్రులు ఎక్కువగా వ్యవసాయ కూలీలే అని, పిల్లలకు రవాణా సౌకర్యాలు ఉండవని, పిల్లలను స్కూల్లో దింపడానికి కూడా వారికి టైం ఉండదని, దీంతో పిల్లలు దాదాపు రెండు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ స్కూల్ వెళ్ళాల్సి వస్తుంది అని బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చేపట్టిన ప్రజా సంగ్రామ పాదయాత్రలో గుర్తించి వారికి సైకిళ్ళు ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను పెంచడానికి ప్రతి సంవత్సరం బండి సంజయ్ వచ్చే నెలలో నర్సరీ నుంచి ఆరవ తరగతి చదివే పిల్లలకు స్కూల్ బ్యాగ్ తో పాటు ఆరు నోట్ బుక్స్, పెన్ను, పెన్సిల్ కిట్టు, స్టీల్ వాటర్ బాటిల్ ఇవ్వనున్నట్లు తెలిపారు, సైకిళ్ళు అందుకున్న విద్యార్థులు తమ బాధను అర్థం చేసుకొని బండి సంజయ్ సైకిల్ ఇవ్వడం వలన రేపటి నుంచి స్కూల్ కి టైం వచ్చి చదువుకొని మంచి మార్కులు సాధించి సంజయ్ పేరు కాపాడుతామని తెలిపారు ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, బల్మూకూరి రాజేష్, రాచపల్లి ప్రశాంత్, రాసమల్ల కుమార్, బూత్ అధ్యక్షులు ఎనమండ్ల రామస్వామి, విజిగిరి రవిందర్, శ్రీవర్ధి ప్రవీణ్, అఖిల్, సిలివేరు రాజు, మేడిపల్లి మహేష్, బోనగిరి ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి ఇంటికి సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమం





అల్లూరి సీతరామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గ దేవీపట్నం మండలం శరభవరం మరియు దేవారం పంచాయితీల్లో గ్రామంలో శాసనసభ్యులు ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవిలిగారు ఇంటి ఇంటికి లిసుపరి పాలన తొలి అడుగు కార్యక్రమం లో పాల్గొని ప్రతి గడపకు వెళ్లి గ్రామస్థులతో మాట్లాడి కూటమి పాలనకోసం చర్చించి గ్రామస్తుల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు ఆరోగ్య పరిస్థితి బాగాలేని వారి కుటుంబానికి నేనున్నా అంటూ భరోసా ఇస్తూ వారిని ఆప్యాయం గా పలకరిస్తూ గ్రామస్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ సీసీ రోడ్లు లేని వీదుల్లో తిరుగుతూ గత ప్రభుత్వం లో ఎంత అభివృద్ధి జరిగిందో గ్రామస్థుల మాటల్లో తెలుసుకున్నారు... ప్రతి సమస్యను పి.ఎ విక్టర్ గారి ద్వారా అర్జీలు పర్సనల్గా డైరీలో నోట్ చేయించటం జరిగింది త్వరలోనే మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియచేసారు. కూటమి ప్రభుత్వం లో ఈ సంవత్సర కాలం నుంచు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు రానున్న రోజుల్లో చేయబోయే కార్యాచరణ వివరిస్తూ ఎంతో అంగరంగా వైభవంగా సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో పాల్గొనగా దేవీపట్నం మండలం టీడీపీ జిల్లా మండలం నాయకులు,మాజీ మండల అధ్యక్షులు, ఎంపీటీసీ లు,జడ్పీటీసీలు,సర్పంచులు వివిధ నామినేటడ్ చైర్మన్స్ నెంబర్స్,గ్రామ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొనగా జనసేనపార్టీ మండల అధ్యక్షులు చారపు వెంకటరాయుడు రంపచోడవరం నియోజకవర్గ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ కుర్ల రాజశేఖర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి కొమరం దొరబాబు, ఎస్టీ సెల్ అధ్యక్షులు కుంజం శ్రీనివాస్ దొర, మండల సీనియర్ నాయకులు ఐనవిల్లి భద్రం,డివిటి అంజి,పెండేటి నర్సింమూర్తి,కొత్తపల్లి సతీష్, తాళ్లూరి పవన్ కుమార్ రెడ్డి,ఈక నాగన్న దొర,పండు దొర, తురం సత్తి బాబు, జగ్గారావు,మీడియా కోఆర్డినేటర్ కారం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు..

# తాడేపల్లి ప్యాలెస్‌కు జగన్ దూరం

అమరావతి

వైయస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్ కు రాలేదా? బెంగళూరు కే పరిమితం అయ్యారా? ఈ ప్రచారంలో నిజం ఎంత? ఎన్నికల ఫలితాలు వచ్చిన నాటి నుంచి జగన్మోహన్ రెడ్డి ఎక్కువగా బెంగళూరుకి పరిమితం అవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అయితే వారంలో మూడు రోజులపాటు తాడేపల్లి లో ఉంటూ.. మరో నాలుగు రోజులు మాత్రం బెంగళూరులో ఎక్కువగా గడుపుతున్నారు. అయితే మద్యం కుంభకోణం నేపథ్యంలో ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి జాడలేదు. ఈవారం తాడేపల్లి ప్యాలెస్ కు ముఖం చాటేసినట్లు ప్రచారం నడుస్తోంది. అందుకు తగ్గట్టుగా తాడేపల్లిలో ఎటువంటి సందడి కూడా లేదు. మద్యం కుంభకోణం కేసులు జగన్ అరెస్ట్ అవుతారన్న ప్రచారం నేపథ్యంలో ఆయన బెంగళూరుకే పరిమితం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2019లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఐదేళ్లపాటు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి వ్యవహరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఆయన తాడేపల్లిలో భారీ ప్యాలెస్ నిర్మించుకున్నారు. అయితే సీఎంగా ఉన్నప్పుడు అదే ప్యాలెస్ ను కార్యాలయంగా మార్చుకున్నారు. పైగా ఆ ప్యాలెస్ నుంచి బయటకు వచ్చింది తక్కువ. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో సరిగ్గా ఎన్నికలకు ఏడాదిన్నర ముందు జిల్లాల పర్యటనకు సిద్ధపడ్డారు. సంక్షేమ పథకాలను ప్రారంభించే సమయంలో తాడేపల్లి పాలెస్ నుంచి బయటకు వచ్చేవారు. అయితే అలా వచ్చే క్రమంలో ఆకాశమార్గంలో ఎక్కువగా ప్రయాణించే వారన్న విమర్శ ఉంది. దానిని పక్కన పెడితే అధికారం కోల్పోయాక జగన్మోహన్ రెడ్డి తీరులో స్పష్టమైన మార్పు కనిపించింది. అప్పటివరకు తాడేపల్లిలో ఎక్కువగా గడిపే జగన్మోహన్ రెడ్డి బెంగళూరు వెళ్లడం ప్రారంభించారు. బెంగళూరులో సువిశాలమైన యలహంక ప్యాలెస్ ఆయనకు ఉంది. అక్కడే నిత్యం సమీక్షలు, సమావేశాలు జరుపుకుంటారు జగన్మోహన్ రెడ్డి. ఎన్నికల ఫలితాల తరువాత.. ప్రతి మంగళవారం సాయంత్రం తాడేపల్లికివచ్చేవారు. మూడు రోజులపాటు ఆ ప్యాలెస్ లో ఉండి తిరిగి బెంగళూరు వెళ్ళిపోయేవారు. గత కొద్ది నెలలుగా ఇదే జరుగుతోంది. కానీ ఈ వారం తాడేపల్లి పాలస్ వైపు జగన్ చూడలేదు. అసలు బెంగళూరు నుంచి బయటకు అడుగుపెట్టలేదు.



వాస్తవానికి బెంగళూరులో ఉన్న యెలహంక ప్యాలెస్ ఆస్తి ఒప్పందంలో భాగంగా షర్మిల కు కేటాయించినట్లు అప్పట్లో ప్రచారం నడిచింది. అయితే ప్రస్తుతం షర్మిల హైదరాబాదులోని లోటాస్ పాండ్ లో ఉంటున్నారు. దీంతో హైదరాబాద్ వైపు జగన్మోహన్ రెడ్డి అసలు చూడడం లేదు. అందుకే ఎక్కువగా ఇప్పుడు బెంగళూరులో గడుపుతున్నారు. తాడేపల్లి వచ్చి రివ్యూలు జరుపుతున్నారు. పార్టీ కీలక నేతలంతా అక్కడే జగన్మోహన్ రెడ్డిని కలుస్తున్నారు. అయితే వారంలో విధిగా మూడు రోజులపాటు తాడేపల్లి ప్యాలెస్ లో ఉంటూ పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసేవారు. కానీ ఈ వారం ఇక్కడికి రాకపోవడం మాత్రం చర్చకు దారితీస్తోంది. మద్యం కుంభకోణం కేసు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. దాదాపు ఈ కేసు తుది దశకు వచ్చింది. రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డి అరెస్ట్ తో పతాక స్థాయికి చేరింది. తరువాత అరెస్టు జగన్మోహన్ రెడ్డి దేనని ప్రచారం నడుస్తోంది. అందుకే ఢిల్లీ స్థాయి లాబీయింగ్ చేసేందుకు ఆయన బెంగుళూరులో ఉండిపోయారన్న ప్రచారం అయితే మాత్రం జోరుగా నడుస్తోంది. ఢిల్లీ నుంచి మాత్రం సరైన సహకారం లేకుంటే మాత్రం ఆయన తాడేపల్లికి వచ్చి మద్యం కుంభకోణం పై ప్రెస్ మీట్ పెట్టే అవకాశం ఉంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక
UDYAM - TS-25-0027265



# పరువాల అందాలతో ఆకట్టుకుంటున్న సోనాల్ చౌహాన్



## 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ' ట్రైలర్ రిలీజ్

మత్తు వదలరా ఫేం.. టాలీవుడ్ యువ నటుడు నరేష్ అగస్త్య ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ' ఈ సినిమాకు విపిన్ దర్శకత్వం వహిస్తుండగా.. ఆగష్టు 22న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే సినిమా లవ్ కమ్ మ్యూజికల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతుంది. తన అమ్మమ్మ కన్న కలలను మనవడు నేరవేర్చడానికి ఏం చేశాడు అనేది ఈ సినిమా స్టోరీ. ఉమా దేవి కోటా నిర్మించిన ఈ చిత్రానికి మోహనా కృష్ణ అద్భుతమైన విజువల్స్ అందించగా, జస్టిన్ ప్రభాకరన్ సంగీతం సమకూర్చారు. రబియా ఖాటూన్ కథానాయికగా నటిస్తుండగా.. రాధికా శరత్ కుమార్, విరాజిత, తులసి, సుమన్, తనికెళ్ల భరణి, ఆమని వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.



## బిడ్డ కోసం అప్పుడే మొదలుపెట్టేశారు

మెగాహీరో వరుణ్ తేజ్ త్వరలో తండ్రి కాబోతున్నాడు. ఈ ఏడాది మే నెలలో తన భార్య లావణ్య త్రిపాఠి ప్రెగ్నెన్సీతో ఉన్న విషయాన్ని బయటపెట్టాడు. అప్పటినుంచి ఓవైపు సినిమా చేస్తూనే మరోవైపు భార్యతో ఎప్పటికప్పుడు టూర్స్ వేస్తూనే ఉన్నాడు. ఇకపోతే పుట్టబోయే బిడ్డ కోసం ఇప్పటినుంచే షాపింగ్ కూడా మొదలుపెట్టేశారు. ఈ విషయాన్ని స్వయంగా లావణ్య త్రిపాఠినే బయటపెట్టింది. నాగబాబు కొడుకు వరుణ్ తేజ్. 'ముకుంద' సినిమాతో హీరోగా పరిచయమయ్యాడు. ఫిదా, కంచె లాంటి చిత్రాలతో ఆకట్టుకున్నాడు. ఎఫ్ 2, ఎఫ్ 3 మూవీస్‌తో హిట్స్ కొట్టాడు. కానీ తర్వాత నుంచి సినిమాలైతే చేస్తున్నాడు గానీ సక్సెస్ కాలేకపోతున్నాడు. గతేడాది 'మట్కా'తో వచ్చాడు కానీ ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం ఓ హారర్ కామెడీ చిత్రం చేస్తున్నాడు. అసలు విషయానికొస్తే తనతో కలిసి సినిమాలు చేసిన హీరోయిన్ లావణ్య త్రిపాఠిని ఆరేడేళ్ల పాటు ప్రేమించిన వరుణ్ తేజ్.. 2023 నవంబరులో పెళ్లి చేసుకున్నాడు. ఈ మే నెలలో తాము తల్లిదండ్రులు కాబోతున్న విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఇప్పుడు రాబోయే బేబీ కోసం షాపింగ్ చేయడం లాంటివి చూస్తుంటే మరో నెలరోజుల్లో గుడ్ న్యూస్ చెబుతారేమో అనిపిస్తుంది.




## విజయ్ దేవరకొండ, సందీప్ వంగా, గౌతమ్.. 'కింగ్‌డమ్ బాయ్స్ పాడ్‌కాస్ట్' వచ్చేసింది

టాలీవుడ్ స్టార్ కథానాయకుడు విజయ్ దేవరకొండ మరో వారం రోజుల్లో(జూలై 31) కింగ్‌డమ్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించగా.. సితార ఎంటర్‌టైనమెంట్స్‌పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ భోర్సే కథానాయికగా నటిస్తుంది.. సత్యదేవ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. జూలై 31న ఈ సినిమా రాబోతుండడంతో ప్రమోషన్స్ మొదలుపెట్టింది చిత్రయూనిట్. ఇందులో భాగంగా చిత్రబృందం ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'కింగ్‌డమ్ బాయ్స్ పాడ్‌కాస్ట్' పేరుతో ఒక ప్రత్యేక ఇంటర్వ్యూను విడుదల చేసింది. ఈ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో దర్శకుడు గౌతమ్ తిన్ననూరితో పాటు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, విజయ్ దేవరకొండ ఉన్నారు. ఈ పాడ్ కాస్ట్‌లో కింగ్‌డమ్ సినిమా విషయాలతో పాటు సందీప్ అప్‌కమింగ్ ప్రాజెక్ట్ స్పిరిట్, విజయ్ అప్‌కమింగ్ చిత్రాలపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తుంది.



## 'కింగ్‌డమ్' డబ్బింగ్ పూర్తి చేసిన భాగ్యశ్రీ భోర్సే

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ కథానాయకుడిగా, గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రాబోతున్న పాన్ ఇండియా చిత్రం 'కింగ్‌డమ్స జూలై 31న రాబోతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. ఇందులో విజయ్ దేవరకొండ స్పై ఏజెంట్‌గా కనిపించబోతున్నాడు. భాగ్యశ్రీ భోర్సే కథానాయికగా నటిస్తుంది. సితార ఎంటర్‌టైనమెంట్స్‌పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. అయితే ఈ సినిమాలో తన పాత్రకు సంబంధించి నటి భాగ్యశ్రీ భోర్సే డబ్బింగ్ పూర్తి చేసుకుంది. ఆమె డబ్బింగ్ స్టూడియోలో ఉన్న ఒక చిత్రాన్ని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఈ విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు.